


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 286 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 22 జూన్ 2025 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :286 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 22 JUNE 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## ప్రపంచ శాంతికి యోగా దిక్సూచి

### విశాఖ యోగా డేలో ప్రధాని మోదీ



- ప్రపంచం సంఘర్షణలతో ఉన్నప్పుడు యోగా శాంతి మార్గం చూపుతుందన్న ప్రధాని
- విశాఖలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న మోదీ
- అంతర్గత శాంతి ప్రపంచ విధానంగా మారాలని ఆకాంక్ష
- ఆర్కే బీచ్‌లో మూడు లక్షల మందితో కలిసి ప్రధాని యోగాసనాలు
- యోగా కేవలం వ్యాయామం కాదు, జీవన విధానమని ఉద్బోధ

- విశాఖలో 'యోగాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- కార్యక్రమానికి 1.44 లక్షల యోగా శిక్షకులు నమోదు చేసుకున్నారని వెల్లడి
- సూర్య నమస్కారాలతో గిరిజన విద్యార్థుల గిన్నిస్ రికార్డును ప్రస్తావించిన సీఎం
- యోగా క్రమశిక్షణ, ఏకాగ్రతను పెంపొందిస్తుందని వ్యాఖ్య

### విశాఖ సాగర తీరంలో అపూర్వ ఘట్టం..

## 'యోగాంధ్ర' గిన్నిస్ రికార్డు కైవసం

- ఏపీ ప్రభుత్వ యోగాంధ్ర-2025 గిన్నిస్ రికార్డు నమోదు
- విశాఖలో 3 లక్షల మందికి పైగా ప్రజల భాగస్వామ్యం
- 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు ఈ ఘనత
- రామకృష్ణ బీచ్ నుంచి భీమిలి వరకు సాగిన యోగాసనాలు
- గతంలో సూరత్‌లో నెలకొల్పిన రికార్డును అధిగమించిన ఏపీ




పెన్ పవర్ డెస్క్:ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర-2025' కార్యక్రమం సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విశాఖపట్నం వేదికగా నిర్వహించిన ఈ బృహత్ యోగా ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఈ అపూర్వ కార్యక్రమంలో మూడు లక్షలకు పైగా ప్రజలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.విశాఖ నగరంలోని సుందరమైన రామకృష్ణ బీచ్ నుంచి భీమిలి వరకు విస్తరించిన సుదీర్ఘ మార్గంలో లక్షలాది మంది ప్రజలు ఏకకాలంలో వివిధ యోగాసనాలు వేశారు. క్రమశిక్షణతో, సమన్వయంతో సాగిన ఈ యోగా ప్రదర్శన చూపరులను అబ్బురపరిచింది. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు ఒకే చోట, ఒకే సమయంలో యోగా చేయడం ద్వారా గతంలో గుజరాత్‌లోని సూరత్‌లో నమోదైన రికార్డును 'యోగాంధ్ర-2025' అధిగమించడం విశేషం. ఈ భారీ జనసమీకరణతో గతంలో సూరత్‌లో 1,47,952 మందితో నెలకొల్పిన యోగా రికార్డును విశాఖ అధిగమించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని

వివరాలు 2లో..

## నా దృష్టిలో ఉక్రెయిన్ మొత్తం మాదే

- సుమీ ప్రాంతంలోకి 10 కిలోమీటర్ల మేర చొచ్చుకెళ్లిన రష్యా సైన్యం
- నాటోలో చేరే ఆలోచనను ఉక్రెయిన్ విరమించుకోవాలని సూచన
- పరిస్థితి తీవ్రం కాకముందే ఒప్పందం చేసుకోవాలని కీవ్‌కు పిలుపు




పెన్ పవర్ డెస్క్:రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడం లేదు. తాజాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్ భవిష్యత్తుపై కీలకమైన వ్యాఖ్యలు చేశారు. తన దృష్టిలో ఉక్రెయిన్ మొత్తం రష్యాకు చెందినదేనని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో కీవ్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూ, పరిస్థితి మరింత దిగజారకముందే చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. మాస్కోలో జరిగిన ఓ కార్యక్రమంలో పుతిన్ మాట్లాడుతూ, "రష్యన్లు, ఉక్రెయిన్లు చారిత్రకంగా ఒక్కటే. ఈ లెక్కన చూస్తే ఉక్రెయిన్ మొత్తం మాదే అవుతుంది. అయినప్పటికీ, కీవ్ సార్వభౌమత్వాన్ని గుర్తించడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు. అయితే, క్షేత్రస్థాయి వాస్తవాలను ఉక్రెయిన్ అంగీకరించాలని, మాస్కో భౌగోళిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని ఆయన నొక్కిచెప్పారు.

వివరాలు 2లో..

## ఇప్పటిదాకా న్యూస్ రీలే, అసలు సినిమా ముందుంది

- తన పాత్ర, బాధ్యతలపై పార్టీదే తుది నిర్ణయమన్న కేంద్ర మంత్రి
- ప్రస్తుతం రోడ్ల పనుల కంటే వ్యవసాయం, సామాజిక కార్యక్రమాలపైనే ఎక్కువ శ్రద్ధ
- విదర్భ రైతుల ఆత్మహత్యలు ఆపడమే తన లక్ష్యమని వెల్లడి
- దేశ జనాభా పెరుగుదల ఆర్థిక సమస్యేనని, మతపరమైంది కాదని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తన పాత్రపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. గత 11 ఏళ్లలో ప్రజలు చూసింది కేవలం ఒక న్యూస్ రీల్ మాత్రమేనని, అసలైన సినిమా ఇంకా మొదలు



వివరాలు 2లో..

## అంతర్జాతీయ యోగా దినోత్సవం భారత్‌కు లభించిన గొప్ప గౌరవం

- విశాఖలో జరుగుతున్న 'యోగాంధ్ర' కార్యక్రమంలో డీప్యూటీ సీఎం ప్రసంగం
- యోగా ప్రాముఖ్యతను రుగ్వేదం చెప్పిందని.. మోదీ ప్రపంచానికి చాటారని వెల్లడి
- ప్రధాని మోదీ సమక్షంలో చంద్రబాబు కృషితో ప్రపంచ రికార్డు సాధిస్తామని వ్యాఖ్య
- సాగర తీరంలో 11వ యోగా దినోత్సవ వేడుకలకు లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు

పెన్ పవర్ డెస్క్:యోగా అనేది భారతీయులకు దక్కిన అమూల్యమైన గౌరవమని, దీనిని ప్రపంచవ్యాప్తం చేసిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకే చెందుతుందని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన 11వ అంతర్జాతీయ



వివరాలు 2లో..

### పాకిస్థాన్ గొంతు ఎండాల్సిందే:

## సింధూ జలాల ఒప్పందంపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు

- సింధూ నదీ జలాల ఒప్పందం పునరుద్ధరణ ఉండదని అమిత్ షా స్పష్టం
- పాకిస్థాన్ ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించిందని ఆరోపణ
- పాక్‌కు వెళ్లే నీటిని కెనాల్ ద్వారా రాజస్థాన్‌కు మళ్లిస్తామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునఃప్రారంభించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ ఒప్పందంలోని నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని, ఇన్నాళ్లూ అన్యాయంగా నీటిని పొందిందని, ఇకపై ఆ దేశం నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని

వివరాలు 2లో..

## చంద్రబాబు పాలనపై సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర విమర్శలు

- రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపణ
- చంద్రబాబు తప్పులను జగన్‌పై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్య



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

## కేశవరావు కాంగ్రెస్ లో ఉన్నారా? లేరా? క్యాడర్ లోనే అనుమానం

మాజీ రాజ్యసభ సభ్యుడు కె. కేశవరావు కాంగ్రెస్ లో ఉన్నారా? లేరా? కేవలం కుమార్తె పదవి కోసమే ఆయన పార్టీ మారినట్లు కనపడుతుంది. ఉన్న రాజ్యసభ పదవి పోయింది. ఏదో కేబినెట్ హోదా పదవి ఇచ్చారు కానీ కేకే కు బీఆర్ఎస్ లో ఉన్నంత ప్రాధాన్యత లేదని స్పష్టంగా అర్థమయింది. కేవలం తన కుమార్తె మేయర్ పదవిని నిలబెట్టుకోవడం కోసమే కేకే పార్టీ మారినట్లు అర్థమవుతుంది. ఆయనకు ఈ వయసులో కావాల్సింది తనకు పదవులు కాదు. తన వారసులు రాజకీయంగా నిలదొక్కుకోవడమే. అందుకే రాజ్యసభ చాలా రోజులు పదవీ కాలం ఉన్నప్పటికీ రాజీనామా చేశారు. తర్వాత ఇప్పుడు కేకే కామ్ గానే ఉన్నారు. కుమార్తె మేయర్ పదవి మాత్రం క్షేమంగా ఉండటం ఒకరకంగా ఊరటఅయినప్పటికీ ఆయన చేసిన పని సరైనదేనా? అన్నది చర్చనీయాంశమైంది.

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి...**

జర్నలిస్టుగా ఉన్న కే కేశవరావు తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ లోనే ఎక్కువ కాలం గడిచింది. అనేక పదవులు కూడా పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, తర్వాత కొత్త రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత కూడా సామాజికవర్గం కోణంలో ఆయనకు రాజకీయంగా నాడు కాంగ్రెస్, ఆ తర్వాత బీఆర్ఎస్ లో మంచి ప్రిఫెరెన్స్ ఇచ్చారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత కేకే బీఆర్ఎస్ లో చేరి కేసీఆర్ కు దగ్గరయ్యారు. . కేసీఆర్ కూడా కేకేకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. పార్టీలో ఉన్నతమైన స్థానాన్ని కల్పించారు. పార్టీలో కీలక పదవి అప్పగించడమే కాకుండా ముఖ్యమైన విషయాలను కేకేకు కేసీఆర్ అప్పగించేవారు. దీంతో పాటు పదేళ్ల పాటు బీఆర్ఎస్ లో ఉన్న కె. కేశవరావు రెండు సార్లు రాజ్యసభ స్థానాన్ని దక్కించుకున్నారు.

**అధికారం కోల్పోయిన వెంటనే...**

కేసీఆర్ కు అత్యంత సన్నిహితుడిగా మెలిగారు. మ్యానిఫెస్టో కమిటీ నుంచి పార్టీలో ప్రధాన బాధ్యతలను కూడా కేశవరావుకు కేసీఆర్ అప్పగించారు. పార్టీలో సెక్రటరీ జనరల్ ను చేశారు. రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేతగా కూడా వ్యవహరించారు. అలా అన్ని రకాలుగా కేసీఆర్ కేకేను అందలం ఎక్కించారు. అంతేకాదు జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగితే ఆయన కుమార్తె విజయలక్ష్మికి మేయర్ గా నియమించారు. అలాంటి కేశవరావు బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన వెంటనే జెండా మార్చేశారు. కారణం ఏదీ చెప్పకపోయినా, చెప్పలేనంత కారణాలు లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లోనే కే కేశవరావు పార్టీ మారినట్లు నాడు స్పష్టంగా అర్థమయింది. ఎందుకంటే రాజ్యసభ పదవికి రాజీనామా చేసి పార్టీ మారాల్సిన అవసరం లేదు.

**ప్రభుత్వ సలహాదారుగా నియమించినా...**

కానీ కుమార్తె మేయర్ పదవి కోసమేనని అందరికీ అర్థమయింది. రాజ్యసభ పదవిని త్యాగం చేసినందుకు గాను కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా కె.కేశవరావను ప్రభుత్వం నియమించింది. కేకేకు కేబినెట్ హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాజీనామా చేసిన రెండు రోజుల్లోనే కె.కేశవరావును నామినేటెడ్ పోస్టులో ప్రభుత్వం నియమించింది. కానీ కేకే పార్టీలో చేరిన నాటి నుంచి పెద్దగా యాక్టివ్ గా పార్టీలో కనిపించడం లేదు. అస్సలు కాంగ్రెస్ లో కేకే ఉన్నారా? అన్న అనుమానం కూడా కలుగుతుంది. గతంలో కాంగ్రెస్ లో ఉన్నప్పుడు తరచూ మీడియా ముందు కనిపించే కే కేశవరావు అసలు కెమెరాలవైపు కూడా చూడటం లేదు. ఆయన అనుకున్న లక్ష్యం కుమార్తె పదవిని కాపాడుకోవడమే. అది మాత్రం నెరవేరింది. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆయనను గుర్తించడం లేదన్నది వాస్తవం. ఇటీవల కేసీఆర్ ను పొగుడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఎటు వైపు తీసుకెళతాయన్న చర్చ జరుగుతుంది.

# ప్రపంచ శాంతికి యోగా దిక్సూచి..

ప్రపంచం నేడు అనేక సంఘర్షణలు, అశాంతి, అస్థిరతతో సతమతమవుతున్న తరుణంలో యోగా శాంతి మార్గాన్ని నిర్దేశిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. విశాఖపట్నంలో ఈ ఉదయం జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ జాతీయ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ యోగా దినోత్సవం 'మానవాళి కోసం యోగా 2.0' కు నాంది పలకాలని, దీని ద్వారా అంతర్గత శాంతి ప్రపంచ విధానంగా మారాలని అంతర్జాతీయ సమాజానికి ఆయన పిలుపునిచ్చారు.

విశాఖలోని ఆర్కే బీచ్‌లో మూడు లక్షల మందికిపైగా ప్రజలతో కలిసి ప్రధాని మోదీ కామన్ యోగా ప్రొటోకాల్ (సీవైపీ)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందం, శాంతిని పెంపొందించడంలో యోగా ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ఘర్షణల నుంచి సహకారానికి, ఉద్రిక్తతల నుంచి పరిష్కారానికి ప్రపంచాన్ని నడిపించడం ద్వారా యోగా శాంతిని చేకూర్చగలదని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. "దురదృష్టవశాత్తు, నేడు ప్రపంచం మొత్తం ఉద్రిక్తత, అశాంతితో సతమతమవుతోంది. అనేక ప్రాంతాల్లో అస్థిరత పెరుగుతోంది. ఇలాంటి సమయంలో యోగా మనకు శాంతి మార్గాన్ని చూపుతుంది. మానవాళి శ్వాస తీసుకోవడానికి, సమతుల్యం చేసుకోవడానికి, తిరిగి సంపూర్ణంగా మారడానికి అవసరమైన విరామ బటన్ యోగా" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.యోగా కేవలం వ్యక్తిగత సాధన మాత్రమే కాకుండా, ప్రపంచ భాగస్వామ్యానికి మాధ్యమంగా మారాలని, ప్రతి దేశం, సమాజం యోగాను తమ జీవన విధానంలో, ప్రభుత్వ విధానంలో భాగంగా చేసుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, యోగా కేవలం వ్యాయామం కాదని, అదొక జీవన విధానమని అన్నారు. "యోగా అంటే సరళంగా చెప్పాలంటే కలపడం. ఇది ప్రపంచాన్ని కలిపింది" అని ఆయన తెలిపారు. ద

**యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం: సీఎం చంద్రబాబు**

యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఒత్తిడి తగ్గి రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్, కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "యోగాను భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చిన దార్శనిక ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ఆయన ఐక్యరాజ్యసమితి ద్వారా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించి, యోగాను ప్రపంచ ఆరోగ్య ఉద్యమంగా మార్చారు," అని కొనియాడారు. నేడు 175కు పైగా దేశాల్లో, 12 లక్షల ప్రదేశాల్లో 10 కోట్లకు పైగా ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొంటున్నారని తెలిపారు. జాతీయత, ప్రాంతం, మతం, భాషలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను స్వీకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.యోగా వల్ల శరీరం, మనసు, ఆత్మల కలయిక జరుగుతుందని, ఇది శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, రోగనిరోధక శక్తి పెంపు, ఆత్మవిశ్వాసం, స్వీయ ఆవిష్కరణ, మానసిక ప్రశాంతత, అంతర్గత శాంతి, సంపూర్ణ శ్రేయస్సుకు దోహదపడుతుందని వివరించారు. దీని ఫలితంగా హింస తగ్గి శాంతి నెలకొంటుందని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ (ఏఐ)తో సహా సాంకేతిక పరిజ్ఞానం యోగాను మరింత అందుబాటులోకి తెచ్చిందని చంద్రబాబు తెలిపారు.

ప్రధాని మోదీ స్ఫూర్తితో రాష్ట్రంలో నెల రోజుల పాటు యోగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించామని, ఇందులో భాగంగా 1.44 లక్షల మంది యోగా శిక్షకులకు శిక్షణ ఇచ్చి, 1.4 లక్షల ప్రదేశాలలో 2.17 కోట్ల మందికి పైగా భాగస్వాములను నమోదు చేశామని సీఎం వివరించారు. ఒక్క విశాఖపట్నంలోనే నగరం నుంచి భోగాపురం వరకు 28 కిలోమీటర్ల మేర 3 లక్షల మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని, మొత్తం 1.7 కోట్ల సర్టిఫికేట్లు జారీ చేశామని వెల్లడించారు. నిన్న 22,122 మంది గిరిజన విద్యార్థులు ఏకకాలంలో సూర్యనమస్కారాలు చేసి గిన్నిస్ రికార్డు సాధించడం గర్వకారణమని, వారికి అభినందనలు తెలిపారు.

యోగాలోని వివిధ అంశాలపై ప్రపంచవ్యాప్త పోటీలు ప్రారంభమయ్యాయని, సెప్టెంబరులో యోగా సూపర్ లీగ్ ప్రారంభం కానుండటం సంతోషకరమని అన్నారు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు, చివరికి ఒలింపిక్ క్రీడలలో యోగాను చేర్చడానికి కృషి చేయాలని ప్రధానమంత్రిని కోరారు. "ఏదైనా చరిత్ర సృష్టించాలన్నా, రికార్డును బద్దలు కొట్టాలన్నా అది నరేంద్ర మోదీజీ వల్లే సాధ్యం, అందుకే నేను ఆయనను అభ్యర్థిస్తున్నాను," అని చంద్రబాబు అన్నారు. గత పదేళ్లుగా ప్రధాని మోదీ యోగాను ప్రోత్సహించడం వల్లే ఇది ప్రజా ఉద్యమంగా మారిందన్నారు.

ప్రతి ఒక్కరూ తమ కోసం రోజుకు ఒక గంట యోగాకు కేటాయించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "యువత యోగాను కేవలం వ్యాయామంగా కాకుండా, వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి డిజిటల్ ప్రపంచంలో ఏకాగ్రత, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంచే శక్తివంతమైన సాధనంగా స్వీకరించాలి. నిరంతర సాధనతో మీ జీవితంలో అద్భుతాలు చూడగలుగుతారు," అని యువతకు పిలుపునిచ్చారు. ఇది అంతిమంగా సంతోషకరమైన సమాజానికి దారితీస్తుందని, "ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ విజన్ 2047', 'వికసిత్ భారత్'లో ఇది కూడా ఒక ప్రధాన లక్ష్యం" అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ యోగా, ప్రకృతి వైద్యం, హరిత ఇంధనం, స్వచ్ఛభారత్, ప్రకృతి వ్యవసాయం వంటివాటిని పునరుజ్జీవింపజేశారని, ఆయన దార్శనికత కేవలం ఆరోగ్యకరమైన ప్రపంచ సమాజం కోసమే కాకుండా, ఆరోగ్యకరమైన భూగ్రహం కోసం కూడా అని చంద్రబాబు ప్రశంసించారు. "ఒకే భూమి, ఒకే ఆరోగ్యం" స్ఫూర్తిని బలోపేతం చేయడానికి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, సంతోషం కోసం అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని అన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం భారత్‌కు లభించిన గొప్ప గౌరవం

- మొదటి పేజీ తరువాయి

యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సూర్య భగవానునికి, యోగ విద్యను అందించిన ఆదియోగి పరమశివునికి, యోగశాస్త్ర రూపంలో మనకందించిన పతంజలి మహర్షికి వందనాలు తెలుపుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.భారతీయ సనాతన ధర్మం యొక్క విశిష్టతను యోగా ద్వారా విశ్వవ్యాపితం చేసిన దార్శనికులు ప్రధాని నరేంద్ర మోదీ అని పవన్ కళ్యాణ్ కొనియాడారు. యోగా సాధకులు ఎంతటి దృఢచిత్తాన్ని కలిగి ఉంటారో, ఒత్తిడిని జయించి సంకల్ప సాధకులుగా ఎలా నిలబడతారో చెప్పడానికి ప్రధాని మోదీయే నిలువెత్తు ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం యావత్ భారత ప్రజలకు, భారతీయులందరికీ దక్కిన గౌరవంగా ఆయన అభివర్ణించారు.2014లో ఐక్యరాజ్యసమితిలో ప్రధాని మోదీ యోగా దినోత్సవంపై తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు, దాదాపు 177 దేశాలు మద్దతు పలికాయని పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు. అంతర్జాతీయంగా ఇంతటి మద్దతు కూడగట్టడం వల్లే 2015 నుంచి యోగా దినోత్సవం అధికారికంగా ప్రారంభమైందని తెలిపారు. ఈ ఏడాది విశాఖపట్నం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సంబరాలకు వేదిక కావడం సంతోషకరమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డుకు వేదికగా నిలిచిందని పవన్ కళ్యాణ్ ప్రశంసించారు."వన్ ఎర్త్, వన్ హెల్త్" అనే థీమ్‌ను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్, ఇతర కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. యోగా గొప్పదనాన్ని ఋగ్వేదంలోనే మన మహానుభావులు తెలియజేశారని, దానిని ప్రపంచానికి చాటిచెప్పిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇప్పటిదాకా న్యూస్ రీలే, అసలు సినిమా ముందుంది

- మొదటి పేజీ తరువాయి

కాలేదని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా వాటిని సమర్థవంతంగా నిర్వర్తించడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, నితిన్ గడ్కరీ తన భవిష్యత్ ప్రణాళికలు, పార్టీలో తన స్థానం గురించి పంచుకున్నారు. "ఇప్పటివరకు మీరు చూసింది కేవలం న్యూస్ రీల్ మాత్రమే. అసలైన సినిమా ఇంకా ప్రారంభం కాలేదు. కార్యకర్తలు ఏం చేయాలి, వారికి ఎలాంటి బాధ్యతలు అప్పగించాలి అనే విషయాలను పార్టీ నిర్ణయిస్తుంది. పార్టీ నాకు ఏ బాధ్యత అప్పగించినా దాన్ని చిత్తశుద్ధితో నెరవేరుస్తాను" అని గడ్కరీ తెలిపారు.ఇటీవల తాను రోడ్ల నిర్మాణ పనుల కంటే వ్యవసాయం, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గత 11 ఏళ్ల మోదీ పాలన గురించి ప్రస్తావిస్తూ, విదర్భ ప్రాంతంలో రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు కృషి చేయాలన్నదే తన ప్రధాన ఆకాంక్ష అని గడ్కరీ అన్నారు. దేశంలో తలసరి ఆదాయం విషయంలో ప్రపంచంలోని తొలి పది దేశాల్లో భారత్ ఎందుకు లేదని అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు."దేశ జనాభానే దీనికి ప్రధాన కారణం. జనాభా నియంత్రణను భాషాపరమైన లేదా మతపరమైన సమస్యగా చూడకూడదు. దాన్ని ఒక ఆర్థిక సమస్యగా పరిగణించాలి. దేశంలో ఎంతో అభివృద్ధి జరుగుతున్నప్పటికీ, జనాభా పెరుగుదల వల్ల ఆ ఫలాలు అందరికీ పూర్తిస్థాయిలో అందడం లేదు" అని ఆయన విశ్లేషించారు. గత రెండు పర్యాయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అనేక రంగాల్లో గొప్ప విజయాలు సాధించిందని గడ్కరీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశ ప్రగతికి దోహదపడిన పలు కీలక నిర్ణయాలను, పథకాలను ఆయన ప్రస్తావించారు.

## నా దృష్టిలో ఉక్రెయిన్ మొత్తం మాదే

- మొదటి పేజీ తరువాయి

ప్రస్తుత సైనిక పరిణామా లపై పుతిన్ స్పందిస్తూ, "సరిహద్దు వెంబడి నిరంతర షెల్లింగ్‌తో ఉక్రెయిన్ మాకు ముప్పు కలిగిస్తోంది. అందుకే, ఒక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. మా బలగాలు సుమీ ప్రాంతంలోకి సుమారు 10 కిలోమీటర్ల వరకు వెళ్లాయి. ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడం మా లక్ష్యం కాదు. కానీ, పరిస్థితి తీవ్రంగా మారితే, దానిని మా అధీనంలోకి తీసుకునే అవకాశాన్ని కొట్టిపారేయలేం" అని హెచ్చరించారు. ఉక్రెయిన్ నాటోలో చేరాలనే ఆశను వదులుకోవాలని పుతిన్ గట్టిగా సూచించారు. "ఈ సైనిక చర్య మీ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తుంది. అది మరింత తీవ్రరూపం దాల్చకముందే మాతో చర్చలకు వచ్చి, ఒక ఒప్పందం చేసుకోవాలి. రష్యా సైనికుడు ఎక్కడ అడుగుపెడితే, ఆ ప్రాంతం మాదే అవుతుందన్న నిజాన్ని గుర్తుంచుకోవాలి" అంటూ పుతిన్ ఉక్రెయిన్‌ను హెచ్చరించారు. ఉక్రెయిన్ లొంగిపోవాలని తాము కోరుకోవడం లేదని, కానీ వాస్తవాలను అంగీకరించి ముందుకు సాగాలని ఆయన వ్యాఖ్యానించారు.

## చంద్రబాబు పాలనపై సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర విమర్శలు

**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రిగా చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యా రని, ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జగన్ రైతుల సమస్యలపై తక్షణం స్పందించి, గిట్టుబాటు ధర కల్పించేవారని గుర్తుచేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని, వీధుల్లోనే గంజాయి అమ్ముతున్నారని సజ్జల ఆరోపించారు. వైసీపీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయిస్తూ పోలీసులు వేధిస్తున్నారని, ప్రభుత్వాన్ని

ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తన తప్పులను ఇతరులపై, ముఖ్యంగా జగన్‌పై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని, వీటిపై ప్రజల పక్షాన వైసీపీ నిరంతరం ప్రశ్నిస్తూనే, పోరాడుతూనే ఉంటుందని సజ్జల స్పష్టం చేశారు. కేవలం మీడియా హైప్‌తోనే చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

## విశాఖ సాగర తీరంలో అపూర్వ ఘట్టం.. 'యోగాంధ్ర' గిన్నిస్ రికార్డు కైవసం

- మొదటి పేజీ తరువాయి

పలువురు అభిప్రాయపడ్డారు. ఈ గిన్నిస్ రికార్డు సాధించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ కీర్తి ప్రతిష్ఠలు అంతర్జాతీయ వేదికపై మరోసారి ఇనుమడించాయి. విశాఖ సాగర తీరం ఈ చారిత్రక ఘట్టానికి సాక్ష్యంగా నిలిచింది.

## పాకిస్థాన్ గొంతు ఎండాల్సిందే: సింధూ జలాల ఒప్పందంపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజీ తరువాయి

ఆయన హెచ్చరించారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా మాట్లాడుతూ, "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేము, కానీ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారతదేశానికి ఉంది. మేం అదే చేశాం" అని అన్నారు. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే అంశం ఉందని, అయితే ఒకసారి దాన్ని ఉల్లంఘించిన తర్వాత రక్షించడానికి ఏమీ మిగలదని ఆయన స్పష్టం చేశారు.

భారతదేశానికి హక్కుగా దక్కిన నీటిని సంపూర్ణంగా వినియోగించుకుంటామని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కెనాల్ నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే జలాలను రాజస్థాన్‌కు మళ్లిస్తామని ఆయన వివరించారు. "ఇంతకాలం పాకిస్థాన్ అన్యాయంగా నీటిని పొందింది. ఇకపై ఆ దేశం గొంతు ఎండిపోవాల్సిందే" అంటూ అమిత్ షా వ్యాఖ్యానించారు.

**పాకిస్థాన్‌పై తీవ్ర ప్రభావం**

1960వ దశకంలో భారత్, పాకిస్థాన్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరింది. అయితే, పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి ఘటన తర్వాత ఈ ఒప్పందం అమలును భారత్ నిలిపివేసింది. ఈ నిర్ణయం పాకిస్థాన్‌కు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆ దేశ నీటి సరఫరా వ్యవస్థ ప్రధానంగా సింధూ జలాలపైనే ఆధారపడి ఉంది. వ్యవసాయానికి వినియోగించే నీటిలో దాదాపు 80 శాతం ఈ ఒప్పందం ద్వారానే లభిస్తోంది. పాకిస్థాన్ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 25 శాతం ఈ నదీ జలాల కారణంగానే వస్తుందంటే, భారత తాజా నిర్ణయం భవిష్యత్తులో ఆ దేశంపై ఎంతటి ప్రభావాన్ని చూపనుందో అర్థం చేసుకోవచ్చు.

## 'యోగాంధ్ర' విజయవంతానికి చంద్రబాబు, లోకేశ్ తీవ్రంగా శ్రమించారు: మంత్రి అనగాని




రాష్ట్రవ్యాప్తంగా 'యోగాంధ్ర' కార్యక్రమం విజయవంతం కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు. యోగాంధ్రను ఇంతటి విజయవంతం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అందించిన సహకారం, వారి కృషి ఎనలేనిదని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమ నిర్వహణలో పాలుపంచుకున్న రాష్ట్ర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విశాఖపట్నం వేదికగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ఒక అరుదైన రికార్డును నెలకొల్పిందని మంత్రి ప్రశంసించారు. ఈ కార్యక్రమంతో యావత్ ప్రపంచం ఒక్కసారిగా ఆంధ్రప్రదేశ్ వైపు దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. కేవలం విశాఖపట్నంలోనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు ఉత్సాహంగా యోగాసనాల్లో పాలుపంచుకున్నారని మంత్రి తెలిపారు. దాదాపు రెండు కోట్లకు పైగా ప్రజలు యోగాంధ్రలో పాల్గొని ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించారని ఆయన వివరించారు. ఈ అపూర్వ స్పందన యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తోందని అనగాని సత్యప్రసాద్ అన్నారు.



## నిర్ణయ్ ద్వారా ఉపాధి హామీ సోషల్ ఆడిట్

గంగవరం, పెన్ పవర్, జూన్ 21:
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామ సభ నిర్ణయ్ యాప్ ద్వారా పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా డ్వామా అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ వి సురేష్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఆమదాల బంద లో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభ ఎస్ఆర్పి పున్నమి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో రెండు మండలాల్లో సామాజిక తనిఖీ జరుగుతుందని ఈనెల 23న గంగవరం లోను, 24న అడ్డతీగల లోని సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ప్రకాష్, జేఈ పద్మనాభం ,ఎంపీటీసీ ఆదినారాయణ, సర్పంచ్ రాజులమ్మ ,ఉపాధి హామీ సిబ్బంది ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ | డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ | తూ॥ గోదావరి | ప॥ గోదావరి | ఏలూరు

# భక్తులతో కిక్కిరిసిన వాడపల్లి క్షేత్రం



## ఏడువారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం

ఆత్రేయపురం పెన్ పవర్ జూన్ 21
కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చందన స్వరూపుడు వెంకటేశ్వర స్వామి, కొలువ ఉన్న స్వయంభు క్షేత్రానికి తెలుగు రాష్ట్రాలన్ని వేలాది గా తరలివచ్చి ఏడు వారాల వెంకన్న నోము నోచుకుంటున్నారు. శనివారం వేకువ జామున, మేలుకొలుపు సేవా, అలంకరణోత్సవం, సుప్రభాత సేవ, అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి మొదటి హారతితో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి వసంత మండపంలో నిత్య కళ్యాణం అష్టోత్తర పూజలలో భక్తుల అత్యంత సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాల స్వీకరించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగ్గు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏడువారాల నోము నోచుకోనే భక్తులు ఆలయం మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణాలునిర్వహించి స్వామివారి దర్శనం చేసుకున్ని ఆలయం ఏర్పాటు చేసిన అన్నదానం ప్రసాదాలు స్వీకరించారు. శనివారం ఒక్కరోజు స్వామివారికి దర్శనానికి వచ్చిన భక్తులు ఇచ్చిన విరాళాలు వివిధ సేవల ద్వారా 60,17,180 రూ, వచ్చినట్లు ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు తెలిపారు.







# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం





## ఎంపీడీవో లక్ష్మణరావు


గంగవరం, పెన్ పవర్ ,జూన్ 21:
ప్రతి వ్యక్తి ప్రతిరోజు యోగా చేసినట్లయితే సంపూర్ణ ఆరోగ్యం గా ఉంటారని ఎంపీడీవో లక్ష్మణరావు అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో యోగా ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పలు యోగాసనాలు వేశారు. మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ మాట్లాడుతూ ప్రతిరోజు కనీసం 40 నిమిషాలు యోగా చేయాలన్నారు. అలాగే వెలుగు ఏపీఎం షణ్ముఖేశ్వర రావు ఆధ్వర్యంలో వనధన వికాస్ కేంద్రం వద్ద డ్వాక్రా మహిళలతో యోగా కార్యక్రమం చేపట్టారు .అలాగే మండలంలోని అన్ని పాఠశాలల్లో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో యోగ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు .ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రధానోపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



గోకవరం, పెన్ పవర్, జూన్ 21 :
ఏజెన్సీ ముఖద్వారం గోకవరంలో ప్రజలకు అందు బాటులో అత్యాధునిక సదుపాయాలతో కూడిన ఆసుపత్రి అందుబాటులోకి వచ్చింది. శనివారం గోకవరం జగ్గంపేట రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. మాజీమంత్రి తోట నరసింహం, ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు విచ్చేసి ఆసుపత్రి యాజమాన్యానికి అభినందనలు తిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఏఎంసీ చైర్మన్ అడపా భరత్ కుమార్, ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, దాసరి తమ్మన్న దొర,కన్నబాబు, మంగరౌతు రాము,బద్దిరెడ్డి అచ్చన్నదొర,దాసరి రమేష్ ఇతర నాయకులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.



# ప్రాణాలు పోతున్నా... వేగ నిరోధకాలను ఎవరు తొలగిస్తున్నారు?

## వై.రామవరం మండలంలో బాధ్యత లేని చర్యలతో పెరుగుతున్న ప్రమాదాల భయం

వై.రామవరం, పెన్ పవర్, జూన్ 21:
"నా అన్న బతికుంటే ఈ నెలలో పెళ్లి చేసేవాడు... కానీ ఆ మలుపు దాటి రాలేదు." ం అంటూ కన్నీటి వెంట తిరుగుతున్నాడు పనసల పాలెంకి చెందిన వెంకటేశ్వరరావు. అతని అన్న అనీల్ గత వారం పనస చెట్టు మలుపు వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.వేగంగా దూసుకొచ్చే వాహనాలను నియంత్రించేందుకు పోలీసులు డ్రమ్ములు ఏర్పాటు చేసినా, కొందరి నిర్లక్ష్యంతో అవి ప్రక్కకు నెట్టివేయబడ్డాయి. వట్టిగడ్డ, గొడుగురాయి, చవిటిదిబ్బలు వంటి మలుపుల వద్ద ఈ వేగ నిరోధకాలు స్థానికుల ప్రాణ రక్షక గదిలా ఉన్నాయి. కానీ పెద్ద లారీలు, ఇసుక ట్రాక్టర్లు తప్పుగా చూస్తూ... ఈ డివైజులు అడ్డుగా ఉన్నాయన్న నెపంతో తొలగించడమే కాదు, రాత్రిళ్లు వేగంగా వెళ్లేందుకు వీటిని పక్కకు వేశారు."వేగ నిరోధకాలు ఉండి ఉంటే, నా కొడుకు బతికుండేవాడు" అని కన్నీటి కలిపిన స్వరం వినిపిస్తోంది మరో తల్లి దగ్గర నుండి. ప్రతి మరణం వెనుక ఒక కుటుంబం గోడు వెలవెలబోతున్నాయి.ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన చిన్న చిన్న చర్యలను ఎవరో అక్రమంగా తొలగించడం వల్ల, ఒక్కో మనిషి జీవితం మాయమవుతోంది. ఇదే సమయంలో, సంబంధిత శాఖల నుంచి స్పందన లేకపోవడం బాధాకరం. "కఠిన చర్యలు తీసుకోండి, మళ్ళీ డ్రమ్ములు ఏర్పాటు చేయండి, అవి తొలగించే వారిపై కఠిన చర్యలు తీసుకోండి". స్థానికులు అధికారులను కోరుతున్నారు.





# యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## - వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 21 :
వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 23న కాకినాడలో జరగనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తి పాడు నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి యువజన విభాగం, విద్యార్థి విభాగ నాయకులు అందరూ సమయం చేసుకొని కాకినాడలో జరిగే యువత పోరు కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నిరుద్యోగ భృతిని విస్మరించిందని దానిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటికో ఉద్యోగం లేదా నెలకి నిరుద్యోగ భృతి 3 వేలు ఇస్తామన్న హామీ కొండెక్కిందని విమర్శించారు. ప్రతి ఏడాది జనవరి ఒకటో తేదీన నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.



## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం..

**యోగా దినోత్సవం లో పాల్గొన్న మండల అధికారులు,నాయకులు.**





**దేవీపట్నం,పెన్ పవర్,జూన్21:**
అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని దేవీపట్నం మండల అధికారుల ఆధ్వర్యంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్ సాల్మన్ రాజు పర్యవేక్షణలో ఇందుకూరుపేట జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ లో వివిధ యోగాసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్ ఇందుకూరుపేట నుండి మెయిన్ రోడ్ వరకు యోగేంద్ర ర్యాలీ నిర్వహించారు.ఎంపీడీవో మాట్లాడుతూ యోగ తమ జీవితంలో దైనందిన కార్యక్రమాలలో ఒక భాగంగా చేసుకోవాలని, ప్రతిరోజు యోగా చేయడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారని, అనేక రకాల అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు అని, ప్రతి పాఠశాలలోనూ వారంలో ఒకరోజు విద్యార్థులకు యోగా నేర్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పాల్గొన్న కూటమి నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు,ఉపాధి హామీ కూలీలు,పాల్గొన్నారు.

## మండలంలో అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవం





**వై రామవరం,పెన్ పవర్, జూన్ 21 :**
మండలంలో 11వ అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మండలం లో ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 21వ తేదీన ఉదయం సచివాలయాలు, పాఠశాలలు,కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు. మండలంలో సుమారు 15,000 మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. గత నెల రోజుల నుండి వివిధ ప్రాంతాలలో యోగాసనాలు నిర్వహించడం జరిగిందన్నారు. 11వ అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవం పురస్కరించుకొని ఉద్యోగులు, విద్యార్థులు ఉపాధి కార్మికులతో పాటు అందరితో యోగా ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.

## యోగా నిత్యం ఆచరిద్దాం...

**ఆత్రేయపురం పెన్ పవర్ జూన్ 21**
మండలంలో మెర్లపాలెంలో గ్రామంలో ఉన్న ఎం.పి.పి. స్కూల్ నెం. 3 నందు యోగాంధ్ర 2025లో కార్యక్రమంలో రాఘవ ప్రజలందరికీ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.యోగా మన సంస్కృతి, మన సంపద, ఆరోగ్యాన్ని మెరుగుపరిచి మానసిక ఉల్లాసాన్ని కలిగించే యోగాను నిత్యం ఆచరిద్దాం అన్నారు.శనివారం అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవం లో ఎం.ఆర్.పి.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ, స్కూల్ మాస్టర్ చిప్పాడ సత్యనారాయణ, స్కూల్ టీచర్ రేలంగి అనిత, స్కూల్ విద్యార్థులు యోగా కార్యక్రమం లో పాల్గొన్నారు.



## యోగాంధ్రలో భాగస్వాములవ్వడం మనందరి అదృష్టం

**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**ఆత్రేయపురం పెన్ పవర్ జూన్ 21**
విశాఖ తీరంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ వేదికగా మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర 2025 లో భాగస్వాములవ్వడం మనందరి అదృష్టమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రపంచానికి భారతీయ సంస్కృతి యొక్క గొప్పదనాన్ని ఈ కార్యక్రమం మరో మారు చాటి చెప్పిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రివర్గ సభ్యులతో సహా సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అశేష ప్రజానీకం పాల్గొన్న యోగాంధ్ర కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ యోగాంధ్ర ఇన్చార్జిగా తాను భాగస్వామి కావడం పట్ల






ఆయన హర్షం వ్యక్తం చేశారు. వ్యాధులకు దూరంగా ఆరోగ్యవంతమైన జీవనం గడపడానికి, శరీరాన్ని, మనస్సును అదుపులో ఉంచుకొని భావోద్వేగాలను నియంత్రించడానికి అద్వితీయ సాధనంగా యోగాను భారతీయ ఋషులు ప్రపంచానికి అందించారని ఆయన తెలిపారు. ప్రతిరోజు కొంతసేపు యోగ, ప్రాణాయామం అభ్యాసించడం ద్వారా ఆరోగ్యపరంగా అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రివర్గ సభ్యులతో సహా సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అశేష ప్రజానీకం పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించినది యోగాంధ్ర కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుల విజన్ కు తార్కాణంగా నిలిచిందని అభివర్ణించారు.

## స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం

**గ్రామ సర్పంచ్ మెర్ల శ్రీరామ చంద్ర మూర్తి**

**ఆత్రేయపురం పెన్ పవర్ జూన్ 21**
మండలంలోమెర్లపాలెం గ్రామ సచివాలయం లోశనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమం లో భాగంగా పర్యావరణ పరిరక్షణ కాపాడేందుకు గ్రామ సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి, ఎంపీటీసీ మెర్ల వీరబాబు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మెర్ల శ్రీరామ చంద్రమూర్తి, మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటే మనిషి అనారోగ్యానికి గురికాకుండా ఉంటాడని ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటితే అది మనకు ప్రాణవాయువునిస్తుందని, సకాలంలో



వర్షాలు వచ్చి పంటల పండడానికి దోహద పడతాయని మనిషి ఆరోగ్య జీవితాన్ని వందేళ్లపాటు జీవనం గడపవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, ఎం.పి.టీ.సి మెర్ల వీరబాబు, గ్రామ టిడిపి అధ్యక్షులు మల్లవరపు నాగరాజు, యూనిట్ ఇంచార్జి మెర్ల లక్ష్మీపతి, జి. రామకృష్ణ, కొమ్మర రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

## పల్లా శ్రీనివాసుని కలిసిన టిడిపి నాయకులు



**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూన్ 21**
టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాసుని టిడిపి నాయకులు శుక్రవారం రాత్రి విశాఖపట్నంలో కలిశారు. శ్రీనివాస్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆయనను పరామర్శించారు. జీలుగు మిల్లి మండలంలో టిడిపి పరిస్థితి పై ఆరా తీశారు. ఒకరికి పదవి ఉండగా మరొక పదవికి అనర్హులని శ్రీనివాస్ తెలిపారని అన్నారు. ప్రజా ప్రతినిధిగా ఉండగా పార్టీ పదవికి అనార్హులని, అదేవిధంగా కె ఎస్ ఎస్ సర్వేలో కచ్చితంగా నమోదు ఐ ఉండాలని అన్నారు. గ్రూపు రాజకీయాలు ఎవరైతే చేస్తున్నారో వారి పైన కఠినమైన చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ తెలిపారని అన్నారు. జీలుగుమిల్లి టిడిపి మండల అధ్యక్షులుగా ఎస్సీ గాని బీసీ కి గాని కేటాయించాలని కోరినట్లు వారు తెలిపారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అందరూ ఉంటారు కానీ అధికారం లేనప్పుడు పార్టీని ఎవరైతే నడిపిస్తారు వారికి కచ్చితంగా గుర్తింపు ఇస్తామని శ్రీనివాస్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గూడపాటి పుల్లయ్య, వనమా వెంకటేశ్వరరావు, గన్నమని సతీష్, బుడిపుటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## యోగ సాధనతో విద్యార్థుల్లో క్రమశిక్షణ





**సీతానగరం, పెన్ పవర్, జూన్ 21:**
యోగా సాధనతో విద్యార్థుల్లో క్రమశిక్షణ మంచి ఆలోచనలు పెరుగుతాయని సీతానగరం మండలంలోని జ్ఞాన నిధి విజ్ఞానికేతన్ ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ మంగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా సాధన మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలపై శనివారం నాడు శిక్షణ ఇచ్చారు, ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మంగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో యోగా సాధన పట్ల మంచి ఆసక్తి పెరుగుతుందన్నారు. ఆరోగ్యకరమైన ఆనందకరమైన సమాజం కోసం యోగ చేయాలని పిలుపిచ్చారు, మన శరీరం మనసు అధీనంగా ఉంచుకొనేందుకు యోగ ఎంతో ఉపయోగపడుతుందన్నారు, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం యోగ చేపట్టారు అన్నారు. 45 నిమిషాల ఆసనాలతో అనారోగ్యాలు దరి చేరకుండా చూడవచ్చని ఎటువంటి ఒత్తిడిని అయినా తట్టుకొని నిలబడేలా యోగ సహకరిస్తుందని వారన్నారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయినీలు తదితరులు పాల్గొన్నారు,

## యోగా మన జీవితంలో భాగం కావాలి

**వంగలపూడి గ్రామ సర్పంచ్ కొంచ అన్నపూర్ణ**



**సీతానగరం, పెన్ పవర్, జూన్ 21:**
నిరంతరం యోగా ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగ మన జీవితంలో భాగం కావాలని సీతానగరం మండలంలోని వంగలపూడి గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ సర్పంచ్ కొంచ అన్నపూర్ణ ఆధ్వర్యంలో శనివారం నాడు ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ యోగా శరీర ఆరోగ్యానికి మానసిక ప్రశాంతతకు శక్తిని పెంచుతుందని జీవన శైలిలో సమతుల్యతను ఏర్పరుస్తుందని మనమందరం యోగాను జీవనంలో భాగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలనిఇటువంటి యోగాను జీవితంలో భాగస్వామ్యం చేసుకుంటే నిరంతరం ఆరోగ్య సమస్యలు తలెత్తవని తెలిపారు, ఈ కార్యక్రమంలోమాజీ జెడ్పిటిసి కొంచెం చంద్ర భాస్కరరావు, జనసేన నాయకుడు వాకాటి సత్తిబాబు, మ మద్దాంశెట్టి వీరన్న, సొసైటీ సీఈవో పంతం వెంకట సూర్యనారాయణ, వేదాంతం శ్రీనివాస్, లగడపాటి రామారావు, కన్నూరి శ్రీనివాస్ , సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు,

## ఘనంగా యోగా దినోత్సవం

**జీలుగుమిల్లి ,పెన్ పవర్, జూన్ 21**
అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు మండలంలో శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. యోగ మాస్టర్స్ సూచనల మేరకు పలు రకాల యోగాసనాలు అభ్యసించారు. ఉదయం 6:30 గంటలకు చేరుకునే గంట పాటు యోగ అభ్యసించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కి మంచి స్పందన వచ్చింది.. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను

# రైతులకు వెంటనే చెల్లించాలి

### చిరు వ్యాపారస్తులను రోడ్డుపాలు చేయొద్దు

### రోడ్డు పాలైన గిరిజనులకు తక్షణమే ప్రత్యన్మయ స్థలాలు చూపించాలి

### మాజీ ఎమ్మెల్యే,నియోజకవర్గ ఇన్చార్జ్ ధనలక్ష్మి డిమాండ్

**దేవీపట్నం/రంపచోడవరం/పెన్ పవర్,జూన్21:**
ఏజెన్సీలో ప్రభుత్వం కొనుగోలు చేసిన దాల్వా ధాన్యానికి తక్షణమే రైతులకు డబ్బులు చెల్లించాలని,సూపర్ సిక్స్ హామీలో భాగంగా రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం ఇప్పటివరకు ఇవ్వలేదని, కొనుగోలు చేసిన ధాన్యం కి రెండు నెలల నుంచి డబ్బులు చెల్లించకపోవడం చాలా దుర్మార్గమని, తక్షణమే ఆ డబ్బులు చెల్లించాలని వైసిపి మాజీ ఎమ్మెల్యే,రంపచోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి డిమాండ్ చేశారు.



రోడ్ల పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దని, ప్రభుత్వానికి అవసరానికి కావలసిన స్థలం మాత్రమే ఖాళీ చేయించాలని,అవసరానికి మించి ఖాళీ చేయించి చిరు వ్యాపారులను రోడ్డుపాలు చేయొద్దని మాజీ ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా రోడ్డుకి ఇరువైపులా కలిపి 100 అడుగులు ఎక్కడా ఖాళీ చేయించలేదని,ట్రాఫిక్ అంతరాయం ఉంటే దానికి అవసరం మేరకు మాత్రమే రోడ్లు ఖాళీ చేయించాలని కోరారు.రంపచోడవరం మారేడుమిల్లి గ్రామాలలో రోడ్డు పాలైన గిరిజనులకు తక్షణమే ప్రత్యామ్నాయ స్థలాలు సెంటర్ దగ్గరలో ఇచ్చి గిరిజనులను వారి పొట్ట పోషించుకునేలా చిరు వ్యాపారులు చేసుకునేలా ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎర్రకాలువపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూన్ 21:**
ఎర్రకాలువపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శనివారం శంకుస్థాపన చేశారు. 8 కోట్ల 8 లక్షల రూపాయలతో తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం వద్ద ఈ శంకుస్థాపన చేశారు. వీరంపాలెం, త్యాజంపూడి వద్ద ఎర్ర కాలువపై వంతెన నిర్మిస్తున్నారు. ఈ వంతెన పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలను కలుపుతోంది. ఈ సందర్భంగా జరిగిన సభకు జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్ ఎన్నికైన మొదటి సంవత్సరంలో గ్రామాలను కలుపుతూ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. రెండో సంవత్సరంలో గ్రామాల్లో రోడ్లు డ్రైనేజీలు నిర్మిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో పనులు చేయాలి అంటే కాంట్రాక్టర్లు పారిపోయేవారని తెలిపారు. రాష్ట్రంలో డబ్బులు లేవని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వైసీపీకి చెందిన జడ్పిటిసి ని అన్ని కార్యక్రమాలకు పిలుస్తున్నామని చెప్పారు. ఒకానొక దశలో మాజీ సీఎం జగన్ పై ఎమ్మెల్యే శ్రీనివాస్ ఫైర్ అయ్యారు. 'రప్పా రప్పామంటూ గొర్రె పోతును కోసేసినట్టు కోసేస్తాడంట, నువ్వేమైనా స్టేట్ రౌడీవా జగన్' అంటూ విరుచుకు పడ్డారు. నీకు అధికారం ఇస్తే సామాన్యుడు రోడ్డుపై తిరుగుతాడా అని ప్రశ్నించారు. కోట్లాది రూపాయలు దోచేసావనే ఇంటికి పంపించారన్నారు. తండ్రి హయాంలోనూ, సీఎం గానూ కోట్లాది రూపాయలు దోచేశారన్నారు. చంద్రబాబును విమర్శించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. మేం రప్ప రప్పాలాడించాలంటే 24గంటలు పట్టదన్నారు. మీ రప్ప రప్పాలు కుర్చీలో మడతపట్టుకోమని సూచించారు. జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ ఎర్ర కాలువపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వంతో మాట్లాడి నిధులు



మంజూరు చేయించారని తెలిపారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ, టిడిపి మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, పట్టింపాలెం ఎంపీటీసీ, కేతిరెడ్డి రాంబాబు కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం బంగారు గూడెంలో 35 లక్షల రూపాయలతో నిర్మించి ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవం





**ఆత్రేయపురం పెన్ పవర్ జూన్ 21**
ఆత్రేయపురం మండలములో ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది.ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆత్రేయపురం మండలం అన్ని గ్రామాలలో యోగాంద్ర కార్యక్రమం ఘనంగా జరిగింది. మండలం కేంద్రం అయిన ఆత్రేయపురం మహాత్మాగాంధీ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం యోగా కార్యక్రమంలో మహాత్మాగాంధీ కళాశాల కరస్పాడెంట్, పి.ఎస్.రాజు , మండల ప్రత్యేక అధికారి యం.వి.రామారావు, ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్, తహశిల్దార్, టి.ఆర్.రాజేశ్వరరావు, కళాశాల లెక్చురర్లు పాల్గొన్నారు. ఉదయం ఆరు గంటల నుండి యోగాసనాలు చేశారు. అనంతరం ఈ యోగా విశిష్టతను మండల స్పెషల్ఆఫీసర్, యం.వి.రామారావు,తెలియజేసారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన ఈ యోగా దినోత్సవం ప్రాముఖ్యతను ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్, మండల ప్రత్యేక అధికారి ఎం.వి.రామారావు వివరించారు. ఈ వేదికపై పలువురు చిన్నారులు ప్రదర్శించిన యోగాసనాలు అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం గ్రామ సచివాలయ కార్యదర్శులు, గ్రామ సచివాల సిబ్బంది పాల్గొన్నారు. మండలములో అన్ని గ్రామ సచివాలయములలో యోగాంద్ర కార్యక్రమములో ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది,యోగాంద్ర ఔత్సాహికులు పాల్గొని యోగాంద్ర కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. అనంతరం కట్టుంగ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నీరు మీరు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

## యోగా మానవ జీవితంలో

# భాగం కావాలి

### తహశీల్దార్ సాయిప్రసాద్

**గోకవరం, పెన్ పవర్, జూన్ 21:**
అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక తహశీల్దార్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల తహశీల్దార్ సాయిప్రసాద్ స్వయంగా పాల్గొని యోగ యొక్క ఆవశ్యకతను తెలిపారు. యోగా



అనేది మన శారీరక,మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని,మనిషి ప్రశాంతంగా బ్రతకడానికి,తన మీద తాను నియంత్రణ సాధించడానికి,ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి యోగా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.మనిషికి శారీరక వ్యాయామం ఎంత అవసరమో మానసిక వ్యాయామం కూడా అంతే అవసరం కాబట్టి అందరూ యోగా సాధన చేసి ఆరోగ్యం పొందాలన్నారు.ఆరోగ్యంగా ఉంటేనే ఎవరైనా లక్ష్యాలు చేరుకోగలమని, మన ప్రధాని నరేంద్రమోడీ మన రాష్ట్రంలో విశాఖపట్నంలో ఈ యోగా సంబరాలలో పాల్గొనడం మనందరికీ ఆనందదాయకం , గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమిష్టిగా గిన్నిస్ రికార్డు నెలకొల్పారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు పలు యోగాసనాలు ప్రదర్శించారు.

## ఎమ్మెల్యేగా ఏడాదిపాలన

# సంతృప్తినిచ్చింది

### రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

**కాకినాడ.పెన్ పవర్ జూన్ 21 :**
కాకినాడ రూరల్ శాసనసభ్యులుగా ఎన్నికై సంవత్సరం కాలం పూర్తి చేసుకున్న రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ఆద్వర్యంలో కాకినాడ రూరల్ జి కన్వెన్షన్ లో మెగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మెగా రక్తదాన శిభిరానికి అతిధులుగా టీడీపీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి చిక్కాల రామచంద్ర రావు , రూరల్ టీడీపీ కో కో ఆర్డినేటర్ కటకం శెట్టి బాబీ గారు, సీనియర్ నాయకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావు, వి వై దాసు ,పెంకే శ్రీనివాస్ బాబా , నరుకుర్తి వెంకటేశ్వర రావు, మామిడాల వెంకటేశ్ , మేక లక్ష్మణ్,బోళ్ల కృష్ణ మోహన్, బీజేపీ నాయకులు చిలుకూరి రాంకుమార్, రంభాల వెంకటేశ్వ రావు, పితాని లీల తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. కూటమి శ్రేణులు స్వచ్ఛందంగా వచ్చి రక్త దానం చేసారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశం లో పంతం నానాజీ మాట్లాడుతూ ఏడాదిగా కాకినాడ రూరల్ నియోజకవర్గం లో జరిగిన అభివృద్ధి ఐదు నిమిషాల్లో చెప్పలేమని అన్నారు. ఈ ఏడాదిగా కాకినాడ రూరల్ లో అనేక పనులకు శ్రీకారం చుట్టి





ఎంతో అభివృద్ధి చేశామన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారన్నారు. ప్రభుత్వ అధికారుల సహాయసహకారాలతో రూరల్ నియోజకవర్గం లో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే నాలుగు సంవత్సరాల కాలంలో రూరల్ నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి పథంలో నడిపిస్తానని పంతం నానాజీ తెలిపారు.. ఈ కార్యక్రమం లో కూటమి పెద్దలు, నాయకులు, శ్రేణులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను

# నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలి

### జేఎన్టీయూకే విసి సిఎస్ఆర్కే ప్రసాద్

### జేఎన్టీయూకేలో ఘనంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు






**కాకినాడ.పెన్ పవర్ జూన్ 21 :**
ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని జేఎన్టీయూకే విసి ప్రొఫెసర్ సిఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని జేఎన్టీయూకే పరిపాలనా భవనం ఎదురుగా నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉపకులపతి ప్రొఫెసర్ సిఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్యామకుమార్ అధ్యక్షత వహించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విసీ సిఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ యోగా సాధన ద్వారా జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు అని అన్నారు. నిత్యం సంతోషంగా ఉండాలంటే ముందు ఆరోగ్యంగా ఉండాలని ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించి సంతోషంగా జీవించవచ్చునని అన్నారు. విద్యార్థులకు ముఖ్యంగా ఇటువంటి కార్యక్రమాల వల్ల ఎన్నో ఉపయోగాలు కలుగుతాయన్నారు. అనంతరం ఉపకులపతి అధికారులు సిబ్బంది విద్యార్థులతో యోగా శిక్షకురాలు డాక్టర్ సిహెచ్ సుధాదేవి వివిధ యోగ ఆసనాలు వేయించి వాటి యొక్క ఆవశ్యకతను వివరించారు. తదుపరి యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన యోగ ప్రదర్శన యోగా థీమ్ సాంగ్ పోటీలు రంగోలి చిత్రలేఖన పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ఉప కులపతి ప్రొఫెసర్ సిఎస్ఆర్కే ప్రసాద్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి రిజిస్టర్ ప్రొఫెసర్ వి రవీంద్రనాథ్ డైరెక్టర్లు యూసీఈకే ప్రిన్సిపాల్,మాజీ ఉపకులపతులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మనసు,శరీరము నిశ్చల స్థితిలో ఉండటమే యోగము

**కొత్తపేట, పెన్ పవర్, జూన్21:**
కొత్తపేట మండలం వానపల్లి లో శనివారం 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లి భీమారావు, మండల పార్టీ అధ్యక్షులు గనిశెట్టి వీరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రతి సంవత్సరం జూన్ 21వ తారీకు ప్రపంచ యోగా దినోత్సవం గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని,యోగము అంటే కలయిక. మనసు, శరీరము ఏకాగ్రతగా నిశ్చల స్థితిలో ఉండటమే యోగము. తద్వారా ఆనందస్థితి కలుగుతుందని.యోగ సాధన ప్రతినిత్యము చేయవలసిన పక్రియని, ప్రభుత్వాలు జూన్ 21వ తారీకున మాత్రమే చేస్తే,మనమందరం ప్రతిరోజు శరీరాన్ని, మనసును ఏకాగ్రతంగా ఉంచి ఆనంద స్థితిలో జీవనయానం చేయాలనేదే దాని సదుద్దేశంఅని, మానవాళి ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలి అనేది దాని సందేశమని వారు అన్నారు. ఈకార్యక్రమంలోపంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## అక్నూ కాకినాడలో 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2025





**కాకినాడ.పెన్ పవర్ జూన్ 21 :**
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎమ్ ఎస్ ఎన్ క్యాంపస్, కాకినాడలో జూన్ 21, 2025న ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించబడింది. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతి శ్రీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో, శారీరక విద్యా శిక్షకులు బి. రామ్ గోపాల్ యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా పలు ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యానం పద్ధతులు వివరిస్తూ విద్యార్థులు, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బందికి శిక్షణ ఇచ్చి వివిధ ఆసనాలను సాధన చేశారు. ఈ సందర్భం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతి శ్రీ "అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎమ్మెస్ ఎన్ క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించటం ఎంతో ఆనందంగా ఉంది. యోగా అనేది కేవలం వ్యాయామం కాదు, ఇది మన శరీరం, మనసు, ఆత్మకు సమతుల్యతనిచ్చే జీవన శైలి. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొనడం హర్షణీయం. భారత ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పం తోడుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలమేరకు ప్రభుత్వం చేపట్టిన నెల రోజుల కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై అందరికీ అవగాహన పెరిగింది అని ప్రతి ఒక్కరూ యోగాను ప్రతిరోజూ జీవన భాగంగా చేసుకోవాలి. యూనివర్సిటీ తరపున ఇలాంటి ఆరోగ్యకర కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తాం అని తెలియజేశారు." ఈ సందర్భంగా మనం ఫౌండేషన్ సభ్యులు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతి శ్రీ కి "భారత్ యోగ భూషణ్ నేషనల్ అవార్డు -2025" అలాగే మనం బుక్ ఆఫ్ రికార్డ్ ధ్రువ పత్రం ని సమర్పించారు , మణికిరెడ్డి సత్యనారాయణ హెల్త్ ఫౌండేషన్ సంస్థ తరపున యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికేట్స్ అందజేశారు . ఈ యోగా కార్యక్రమం ద్వారా విద్యార్థులు మరియు సిబ్బంది నైతిక, శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకుంటూ, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకునేలా ప్రేరణ పొందారు. విశ్వవిద్యాలయం యాజమాన్యం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతీ సంవత్సరం ఈ విధంగానే ఆరోగ్య పరిరక్షణ అభిముఖంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా ప్రపంచ యోగ దినోత్సవం

### - జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్,ఎస్.సాయి రమణ

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూన్.21**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మండలంలోని వి.ఆర్.పురం ప్రభుత్వ జూనియర్ కళాశాలో శనివారం ప్రిన్సిపాల్, ఎస్.సాయి రమణ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ యోగ దినోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా





ప్రిన్సిపాల్,ఎస్.సాయి రమణ మాట్లాడుతూ ఆత్మను తనువును మనసును ఏకం చేసే ఏకైక సాధనం యోగ అన్నారు.యోగ అంటే తలకిందులుగా నిలబడటమే లేదా శ్వాస దిగబట్టడమో కాదు యోగా అంటే జీవితాన్ని మీ అధీనంలోకి తెచ్చుకోవడం యోగ ఆసనాలు వల్ల కలిగే ప్రయోజనాలు ఆరోగ్యానికి మేధాశక్తికి జీవనశైలికి ఎంతో తోడ్పడతాయని, తెలిపారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొవడం గురించి ప్రతిపాదన చేశారు.ఈ తీర్మానానికి 193 ఐ.రా.స ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు.భద్రతా కమిషన్లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం అమెరికా ఇంగ్లాండ్,చైనా,ఫ్రాన్స్,రష్యా దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది.2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు.జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది.ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారని,తెలిపారు.ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ చినబాబు,అది అధ్యాపకులు మురళి దొర,నాగ సాంబశివరాజు, సత్యనారాయణ,నరసింహారావు,ఎలిసా లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు,బాలు,దేవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల లక్ష్యసాధనకు

# యోగ సాధనే మార్గము

### యోగా గురువు, ఎం లక్ష్మణ కుమార్.. ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు





**కాకినాడ.పెన్ పవర్ జూన్ 21:**
స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల( స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు మాట్లాడుతూ మానసిక, శారీరక, దృష్టి సామర్థ్యాన్ని పెంచి గొప్ప వ్యక్తిత్వాన్ని నిర్మించడానికి యోగాను మించిన సాధన మరొకటి లేదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దినోత్సవాన్ని అత్యద్భుతంగా నిర్వహిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా యోగా గురువులను డాక్టర్ నాయుడు సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యోగ గురువులు ఎం లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల లక్ష్యసాధనకు యోగ సాధనే సరైన మార్గమని పిలుపునిచ్చారు. ఓంకారంతో యోగా కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులచే ఏకాగ్రతకు సంబంధించిన యోగాసనాలు వేయించారు. సూర్య నమస్కారాలను ప్రాణాయామా విద్యార్థులతో చేయించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన యోగ గురువు ఎం జగదాంబ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి యోగ తన దినచర్యలో భాగం కావాలని, జంక్ ఫుడ్ కి దూరంగా ఉంటూ, సరైన జీవన మార్గం ఎంచుకోవాలని, యోగా చేయడం వలన రోగాలను దూరం చేయవచ్చని తెలిపారు. అష్టాంగ యోగ మార్గాలను వివరించి, సూర్య నమస్కారాలు, ధ్యానము,యోగ క్రియల వలన కలిగే ప్రయోజనాలను తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా చేసిన పబ్బినీడి ఈశ్వరరావు మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యం కోసం యోగా చేయాలని, ఒక ప్రతి వ్యక్తి జీవితంలో భాగస్వామ్యం కావాలని అన్నారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించి, యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ , ఇంచార్జ్ మూర్తి, ఎన్ ఎస్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, యోగా శిక్షకులు టి.తేజేశ్వరరావు, సీనియర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ శ్రీ కళ్యాణ్, శ్రీలక్ష్మి , వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా "యోగాంధ్ర"

### గిన్నిస్ రికార్డు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన "పిల్లి" దంపతులు

**కాకినాడ.పెన్ పవర్ జూన్ 21 :**
ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమం ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని,ఆరోగ్యవంతమైన జీవనశైలి కోసం యోగా ను ప్రతి ఇంటికి తీసుకెళ్లే ప్రయత్నం అభినందనీయం అని టీడీపీ కాకినాడ రూరల్ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి లు పేర్కొన్నారు. గైగోలుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో టిడిపి నాయకులు పాలిక సతీష్ అధ్యక్షతన జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే "పిల్లి " దంపతులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కోఆర్డినేటర్ "పిల్లి" దంపతులు మాట్లాడుతూ యోగా ని ప్రపంచానికి పరిచయం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి భారత దేశం ఎప్పటికీ ఋణపడి ఉంటుందని యోగాంధ్ర తో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్



చోటు సంపాదించడంలో మంత్రి నారా లోకేష్ కృషి అమోఘమన్నారు. యోగ ద్వారా భారత్ గ్లోబల్ లెవల్లో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించే దేశంగా నిలిచిందన్నారు.యోగ మన పూర్వీకుల నుంచి వచ్చిన అమూల్యమైన ఆధ్యాత్మిక విద్య అని శరీరారోగ్యాన్ని పరిరక్షించడంలో, మానసిక స్థిరత్వాన్ని పెంపొందించడంలో యోగ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ ప్రకారం ఆరోగ్యాంధ్ర కోసం ప్రతి ఒక్కరూ యోగా ను జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం 'యోగాంధ్ర' పేరుతో యోగాను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు,స్థానిక ప్రజలు అందరికి యోగా ప్రాముఖ్యతను అవగాహన కలిగించిందన్నారు.అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సాన సతీష్ క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ లక్ష్మణరావు, యోగా అభ్యాసకులు,కూటమి నాయకులు, కార్యకర్తలు,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యోగ ప్రక్రియను ప్రతి ఒక్కరూ

# నిత్య జీవనసరళిగా మలచుకోవాలి

### జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ.పెన్ పవర్ జూన్ 21 :**
శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే యోగ ప్రక్రియను ప్రతి ఒక్కరూ నిత్య జీవన సరళిగా మలచుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ప్రజలను కోరారు. శనివారం 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించి జిల్లా స్థాయి కార్యక్రమాన్ని స్థానిక 3 లైట్ల జంక్షన్ ఎండోమెంట్స్ ఆఫీస్ రోడ్డులో ఆయుష్ విభాగం, మున్సిపల్ కార్పొరేషన్, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ముఖ్య అతిధిగాను, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి.బిందుమాధవ్,రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. తొలుత అతిధులు పతంజలి మహర్షి చిత్రపటానికి పూలు అలంకరించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యోగాచార్య రాఘవానంద వేడుకలకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పుర ప్రజలు సుమారు 3 వేల మందిచే యోగ అభ్యాసాన్ని, ప్రణాయామ ప్రక్రియలను చేయించారు.ఈ సందర్భంగా వివిధ యోగాసనాలను చేసేపుడు పాటించవలసిన నియమాలు, జాగ్రత్తలు, వాటి వల్ల ఒనగూడే ఆరోగ్య ప్రయోజనాలను యోగాచార్య ప్రజలకు వివరించారు. తదుపరి బ్రహ్మకుమారి రజనీ దీది రాజయోగ సాధన గురించి వివరించి, ఆహూతలచే ధ్యాన ప్రక్రియ చేయించారు.అనంతరం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి జిల్లా ప్రజల నుద్దేశించి మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. శారీరక, మానసిక ఆరోగ్యంతో మనిషి పరిపూర్ణ వికాసానికి దోహదం చేసే యోగ అనాదిగా భారతీయ జీవన శైలిలో అంతర్వాహినిగా ఉందని, ఈ విశిష్ట విజ్ఞాన ప్రయోజనాలను ప్రపంచ మానవాళి అందరూ పొందాలనే శ్రేయో భావనతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి చేసిన కృషి కారణంగా దశాబ్దకాలంగా ఏటా జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతోందన్నారు. 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని కాకినాడ జిల్లాలో గత నెల రోజులుగా నిర్వహించడం జరిగిందన్నారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధన లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసినందుకు జిల్లా ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమాల్లో ఎక్కడా ఏచిన్న అపశృతి చోటు చేసుకోలేదని,సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమాలను ఆయూష్, రెవెన్యూ, పోలీస్, పంచాయితీరాజ్, మున్సిపల్, మెప్మా, డిఆర్డిఏ తదితర శాఖలు నెల రోజుల పాటు సమర్థవంతంగా కార్యక్రమాలను నిర్వహించాయని కలెక్టర్ అభినందించారు. అలాగే యోగ పట్ల ప్రజలలో అవగాహన, చైతన్యం జాగృతం చేసి యోగాంధ్ర కార్యక్రమాలు ఉద్యమ స్ఫూర్తితో జరిగేలా సహకరించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు, యోగాచార్యులకు,వ్యాయామ ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నెల రోజులుగా అభ్యసించిన యోగ, ధ్యాన ప్రక్రియలను నిరంతరాయంగా నిత్యం కొనసాగించి ఆరోగ్య ప్రయోజనాలను పొందాలని జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలను కోరారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ యోగ విద్య భారతీయల విశిష్ట సంపదని, ఈ విద్యను ప్రపంచ దేశాలకు పంచి మన దేశం విశ్వగురువుగా నిలిచిందన్నారు. వ్యక్తి సర్వతో వికాసాని దోహదం చేసే యోగ సాధనకు ప్రత్యేక పరికరాలుగాని, స్థలంగాని అవసరం లేదని, ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో ఒక భాగంగా అలవరుచుకోవాలని కోరారు.ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ఆరోగ్య సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమని, అందుకే ప్రధాన మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి యోగ పట్ల ప్రజలను చైతన్యపరస్తున్నారన్నారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ప్రసంగిస్తూ దేహం, మనసు, మేధస్సులను సుదృఢం చేసే యోగా ను అందరూ సాధన చేయాలని కోరారు. వేడుకల్లోలో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించిన యోగాచార్యులను, శిక్షకులను, ఆయూష్, తదితర శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో సుభానికేతన్ విద్యార్థులు, పీఠికాపుర యోగ విద్యాపీఠం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, యోగాచార్య రాఘవానంద ఆధ్వర్యంలో పంతంజలి యోగా ఇన్స్టిట్యూట్ విద్యార్థులు బిస్మిల్లాఖాన్ వాద్య సంగీతానికి అనుగుణంగా నిర్వహించిన యోగాసన ప్రదర్శన ఆహూతులను ఆకట్టుని అలరించాయి. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ డి.రవీంద్రనాధరెడ్డి, డిఆర్ఓ జె.వెంకట్రావు, ఆయుష్ విభాగ అధికారి డా.ఎంఎస్.ఆలీ, డిఎంహెచ్ఓ జె.నరశింహనాయక్, డ్వామా పిడి పి.వెంకట లక్ష్మి, మెప్మా పిడి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, యోగ సాధనాభిలాషులు పాల్గొన్నారు.





# రేపు జగ్గంపేటలో ఒలంపిక్ డే రన్

**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 21:**
ఈనెల 23 సోమవారం జగ్గంపేటలో ఒలింపిక్ డే రన్ నిర్వహించడం జరుగుతుందని జిమ్ అండ్ కరాటే మాస్టర్ టీవీవి రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గంపేట ప్రభుత్వ హైస్కూల్ నుండి మెయిన్ రోడ్ లో ఉన్న పంచాయతీ కార్యాలయం వరకు ఒలంపిక్ డే రన్ నిర్వహిస్తామన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఒలంపిక్ డే రన్ లో పాల్గొనే విద్యార్థులు గవర్నమెంట్ హై స్కూల్ కు చేరుకోవాలన్నారు. ఈ ఒలంపిక్ డే రన్ లో పాల్గొంటే ఒలంపిక్ అసోసియేషన్ కాకినాడ వారిచే సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు. తప్పనిసరిగా అందరూ ఒలింపిక్ డే రన్ లో పాల్గోవాలని రమణ కోరారు.

# యోగాతో మానసిక ప్రశాంతత

## డాక్టర్ ఒమ్మి రఘురామ్






**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 21:**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం జగ్గంపేట వివేకానంద విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఒమ్మి రఘురామ్ మాట్లాడుతూ యోగ అనేది మన శారీరిక మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని, మనిషి ప్రశాంతంగా బ్రతకడానికి, తన మీద తాను నియంత్రణ సాదించాడనికి,ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి యోగా ఉపయోగపడుతుందని అన్నారు. మనిషికి శారీరక వ్యాయామం ఎంత అవసరమో మానసిక వ్యాయామం కూడా అంతే అవసరం కాబట్టి అందరూ యోగ సాధన చేసి ఆరోగ్యం పొందాలన్నారు, ఆరోగ్యం గా ఉంటేనే ఎవరైనా లక్ష్యాలు చేరుకోగలమన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు పలు యోగాసనాలు ప్రదర్శించారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 100వ రోజు మజ్జిగ పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 21:**
జగ్గంపేటలోని శ్రీ బాలాజీ జూలయర్స్ షాప్ వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతిరోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మజ్జిగ పంపిణీ శనివారంకు 100వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదచారులకు, వాహనదారులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలు అందరికీ కొండబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకుని ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు చంద్రమౌళి వెంకట శాస్త్రి, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మానేపల్లి రామానుజ, జగ్గంపేట సెక్రటరి ఉద్దగిరి కామేష్,కొత్త నాగపండు, కాకి విజయ్ కుమార్,కాకి ఆనంద్ కుమార్, మరియు వాసవి క్లబ్స్ సభ్యులు పాల్గొన్నారు.

# పాడి గేదెకు గాయాలు

**పెనుమంట్ర, పెన్ పవర్, జూన్ 21:**
మండలంలోని గుమ్మలూరు చినపేటకు చెందిన చికిలే మాషేను రావుకు చెందిన పాడి గేదె దురదృష్టవశాత్తు పాక అంటుకొని గేదె శరీర భాగం 70శాతం కాలిపోయింది. విఆర్ఓ సలీమ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వైద్య సిబ్బంది శ్రీవాస్ వైద్యం అందించారు. దోమలకు పొగ వేసేందుకు మంట వేయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. పాక పూర్తిగా దగ్ధమైంది. గేదె విలువ సుమారు 1లక్షా ఏబై వేలు ఉంటుందని అంచనా. రెండు రోజులు గడిచే వరకు గేదె ఆరోగ్య పరిస్థితిని చెప్పలేమని పశు వైద్యులు పేర్కొన్నారు.



# నిత్యం యోగా సాధనతో జీవితకాలం సంపూర్ణ ఆరోగ్యం

## అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి





**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 21:**
నిత్యం యోగా సాధనతో జీవితకాలం ఆరోగ్య వంతులుగా ఉండవచ్చని కిర్లంపూడి మండలం ప్రజా పరిషత్ అధ్యక్షుడు తోట రవి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కిర్లంపూడి మండలం వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ తోట రవి మాట్లాడుతూ మన శరీరాన్ని, మనసును ఆధీనంలో ఉంచుకునేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆరోగ్యకరమైన, ఆనందకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ యోగా సాధన దిన చర్యల్లో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.నిత్యం కొంత సమయాన్ని యోగాసనాలకు కేటాయించడం వల్ల ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా కాపాడుకోవడమే కాకుండా, ఎటువంటి ఒత్తిడి అయినా తట్టుకునేలాగా యోగ ఎంతగానో సహకరిస్తుందన్నారు. శారీరక ఆరోగ్యానికి, మానసిక దృఢత్వానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో నిర్వహించిన యోగాంధ్రా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోడీ,నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ లకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సుమారు 45 నిమిషాల పాటు యోగాసనాలు వేశారు.

ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తోట గాంధీ, ఎంపీడీఓ బావిశెట్టి హరికృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలాది దుర్గాప్రసాద్, ఎస్ఎంసి చైర్మన్ పి గణేష్, గొల్లపల్లి సూరిబాబు, సిద్దు,రాము, అంగన్వాడి కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా యోగాంధ్ర

**పెనుమంట్ర, పెన్ పవర్, జూన్ 21:**
మండలంలోని భట్లమగుటూరు గ్రామంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం గ్రామపంచాయతీ కార్యదర్శి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. యోగాంధ్ర ప్రత్యేక అధికారి కృష్ణకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వలన ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. శారీరక శక్తిని, మనస్సుకు ప్రశాంతతను



చేకూరుస్తుందన్నారు. ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప వరం యోగ అన్నారు. కేవలం ఆసనాలే కాదు యోగా అంటే మన జీవన విధానాన్ని జీవిత క్రమశిక్షణను అలవరుస్తుందన్నారు. కాబట్టి యోగాను ప్రతీ ఒక్కరం అనుసరిద్దాం యోగా భారత దేశ సంస్కృతిలో భాగం శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యానికి సహాయపడే యోగాను మన దేశ ప్రధాని మోదీ ప్రత్యేక కృషితో ప్రపంచమంతా గుర్తించిందన్నారు. సంవత్సరం జూన్ 21 ను "ప్రపంచ యోగా దినోత్సవం" జరుపుకుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మంగతాయారు, వెల్ఫేర్ అసిస్టెంట్ లావణ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ తేజశ్రీ, గ్రామ సర్వేర్ పవన్ కళ్యాణ్, పొలమూరి రాజేష్, గంగారావు, ఫీల్డ్ అసిస్టెంట్ జి ఎన్ మూర్తి, ఉపాధి హామీ శ్రామికులు సూపర్వైజర్ వెంకటలక్ష్మి, కూటమి నాయకులు, బట్లమగుటూరు గ్రామ ప్రజలు, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జగ్గంపేట జూనియర్, డిగ్రీ కాలేజీల్లో యోగా దినోత్సవం



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 21:**
అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం జగ్గంపేట జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు వివిధ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగ ప్రాముఖ్యతను దానివల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ దయనందిన జీవితంలో ప్రతిరోజు యోగా అలవర్చుకోవాలని సూచించారు. అలాగే జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిన్నారావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హార్ట్ ఫుల్ ఫౌండేషన్ యోగ గురువులు డాక్టర్ టి.శివరామకృష్ణ, పి.సూర్యనారాయణ, దొర, గోవిందరావు, మౌనిక, శ్రీ కళ తదితరులు విచ్చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రస్తుత జీవనశైలిలో యోగ ఒక భాగమని తెలిపారు. అనంతరం యోగా గురువులు ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, కొన్ని ముఖ్య ఆసనాలు అందరితో వేయించారు.




# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**పెనుమంట్ర, పెన్ పవర్, జూన్ 21:**
పెనుమంట్రమండలంలోని మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ వారి ఆధ్వర్యంలో 11వ "అంతర్జాతీయ యోగా దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డా. ఎన్. శ్రీనివాస రావు మాట్లాడుతూ ఒత్తిడిని జయించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి, క్రమం తప్పకుండా యోగా సాధన చెయ్యాలని సూచించారు. ప్రపంచమంతా యోగా ప్రాముఖ్యతను గుర్తించి ఈ రోజున యోగా దినోత్సవం జరుపుకోవటం మనకెంతో గర్వకారణమని తెలిపారు.అనంతరం వ్యవసాయ పాలిటెక్నిక్ ఫిజికల్ డైరెక్టర్ కె. రమేష్ యోగా లోని వివిధ ఆసనాలను విపులంగా వివరించి, విద్యార్థులు, శాస్త్రవేత్తలు మరియు సిబ్బంది చే అభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు, బోధనా బోధనేతర సిబ్బంది, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు మరియు ఇతర సిబ్బంది యోగాసనాలను సాధన చేశారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

## మున్సిపల్ చైర్ పర్సన్ దుర్గారాణి

**మండపేట. పెన్ పవర్.జూన్ 21 :**
యోగాసనాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించనుందని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సూర్య కన్వెన్షన్ హాలులో యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దుర్గారాణి మాట్లాడుతూ ఆధునిక యాంత్రిక జీవనశైలి కారణంగా అన్ని వయస్సులవారు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల్లో యోగమే దివ్య ఔషధంగా మారిందని, యోగాసనాల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని వివరించారు. ఈ సందర్భంగా యోగ గురువులు కురసా సత్యనారాయణ, అంకం భాస్కరరావు, మణి కుమార్‌లు యోగాభ్యాసాన్ని నిర్వహించారు. వారిని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ లు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, కాసిన కాశీ విశ్వనాథం, గ్రంధి శ్రీనివాస్, టీడీపీ నాయకురాలు గడి సత్యవతి, మున్సిపల్, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వైఎస్ఆర్ పార్కులో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం



**మండపేట. పెన్ పవర్. జూన్ 11 :**
11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బురుగుంట చెరువు వైయస్సార్ పార్క్ లో డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు కోన సత్యనారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమానికి క్లబ్ గౌరవాధ్యక్షులు రెడ్డి రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్లబ్ కార్యదర్శి, యోగా గురువు అబ్బాస్ వాకర్స్‌కు యోగాభ్యాసాలు, ధ్యానం చేయించారు. అనంతరం ఆయనను క్లబ్ తరఫున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సిహెచ్. భాస్కరరాజు, గంపల సత్యప్రసాద్, లంక సత్యనారాయణ, తిరుశూల వెంకట్రావు, రవికిరణ్, బాబి, రమేష్, సత్యనారాయణతో పాటు వాకర్స్ క్లబ్ మహిళలు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### బిజెపి నాయకులు



**టీ నర్సాపురం, పెన్ పవర్, జూన్ 21:**
మక్కిన వారిగూడెం గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మరియు, మహంకాళి పుల్లారావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఏలూరు రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు దామిశెట్టి సాయి




మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్ఫూర్తితో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది అని తెలిపారు. గతంలో కూడా రక్తదాన సేవ నిర్వహించమని తెలిపారు. గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన ప్రతిసారి గ్రామ యువత నుండి స్పందన వస్తుందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ పి ఆర్ ఓ డా. కొల్లి వెంకట రమణ మాట్లాడుతూ రక్తదానం వల్ల ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టవచ్చు అన్నారు. తరచూ రక్తదానం చేయడం వల్ల షుగర్ బీపీ థైరాయిడ్ లాంటి వ్యాధులు దరిచేరమన్నారు. రక్తదానం వల్ల ఎంతోమంది తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రాణాలు నిలిపిన వారు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం గోపాలం, నీటి సంఘం ఆద్యక్షులు దామిశెట్టి కేశవరావు, మాలంపాటి సంజయ్, జనసేన నాయకులు రాఘవరాజు సురేష్, పి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలి

### -జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్

**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 21:**
ప్రతి మనిషి జీవితకాలం ఆరోగ్యంగా ఉండాలంటే,మన జీవన విధానంలో యోగా సాధన ఒక భాగం కావాలని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ తుమ్మలపల్లి రమేష్ అన్నారు.



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కిర్లంపూడి మండలం రామచంద్రపురం, తామరాడ గ్రామాల్లో తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో, రామచంద్రాపురం సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించిన యోగాంధ్రా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, ఆనందకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరి దినచర్యల్లో యోగా సాధన ఒక భాగం కావాలని పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వలన శరీరం, మనస్సు మన ఆధీనంలో ఉండడమే కాకుండా, జీవిత కాలం ఆరోగ్యంగా ఉంటామని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో జనసైనికులు, జనసేన నాయకులు,, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.



## వైఎస్సార్సీపీ 'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

**కాకినాడ.పెన్ పవర్ జూన్ 21 :**
వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం 23న జరగనున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్సిపి పార్టీ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు రాగిరెడ్డి అరుణ్ కుమార్, పార్టీ రాష్ట్రజనరల్ సెక్రెటరీ తోట శ్రీరాంజీ , పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.జి.కె. కిషోర్ పిలుపునిచ్చారు. శనివారం కాకినాడ వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలోవైఎస్సార్సీపీ 'యువత పోరు' పోస్టర్



ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నిరుద్యోగ భృతిని విస్మరించిందని, దానిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం లేదా నెలకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు'ఇస్తామన్న హామీ కొండెక్కిందని విమర్శించారు. మంత్రి నారాలోకేష్ ఎన్నికల సమయంలో ప్రతి ఏడాది జనవరి 1ననిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీ ఏమైందనిప్రశ్నించారు. 'యువగళం' పేరుతో రాష్ట్ర యువత అందరినీ లోకేష్ మోసం చేశారని వారు ధ్వజమెత్తారు. ఉలవల భూషణం, దాసం వెంకటేష్ , కరణం భాను, వీరం రెడ్డి నాని, సకురు గుర్రాజు, రోకళ్ళ సత్యనారాయణ, తిరుమల శెట్టి లక్ష్మీకాంత్, సిడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శారీరక, మానసిక ప్రశాంతతకు యోగా దోహదం

### ఏఎంసీ డైరెక్టర్ గుత్తుల సూర్యావతి

**పెద్దాపురం, పెన్ పవర్, జూన్ 21:**
శారీరక, మానసిక ప్రశాంతత కోసం ప్రతీ ఒక్కరూ యోగాను ఆచరించి భారత నవ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పెద్దాపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి గుత్తుల సూర్యావతి పిలుపునిచ్చారు. పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలో శనివారం నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో సూర్యావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బందితో కలిసి యోగ ప్రక్రియలు



చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమని అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యోగా పట్ల ప్రజలను చైతన్య పరుస్తున్నారన్నారు. వ్యక్తి సర్వతోవికాసానికి దోహదం చేసే యోగా ప్రక్రియను ప్రతీ ఒక్కరూ నిత్య జీవన సరళిగా మలుచుకోవాలని ఆమె అన్నారు.

## బీఆర్ నాయుడుకు స్వాగతం పలికిన బెహరాన్ జనసేన కన్వీనర్ రాయుడు



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 21**
బెహరాన్ లో జరిగే శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు నిమిత్తం బెహరాన్ విచ్చేసిన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడుకు బెహరాన్ జనసేన పార్టీ కన్వీనర్ రాయుడు వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో బెహరాన్ లో చేపట్టిన కళ్యాణోత్సవాలలో పాల్గొన్న దానికి టిటిడి చైర్మన్ హెూదాలో బిఆర్ నాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ తరఫున బెహరాన్ కన్వీనర్ రాయుడు వెంకటేశ్వరరావు తో పాటు పలువురు నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు స్వాగతం పలికారు.

# యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం

### - మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు





**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 21:**
ప్రతి మనిషి నిత్యజీవితంలో యోగా సాధన చేయడం వలన జీవితకాలం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ప్రతి రోజు యోగా సాధన చేయడానికి దీక్షబూనాలని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు, కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశానుసారం మండల కేంద్రమైన కిర్లంపూడి విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శరకణం రాజబాబు, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం యోగాంధ్రా కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండలం ఇన్చార్జి పసుపులేటి సత్తిబాబు, ఉపాధ్యక్షులు బుద్ధ పెదకాపు, బీజేపీ నాయకులు మారిశెట్టి త్రిమూర్తులు, పెంటకోట సత్యనారాయణ, అతికంశెట్టి సత్యనారాయణ, విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు,పలువురు ఉపాధ్యాయులు, స్కూల్ పెద్దలు శివశంకర్, అధిక విద్యార్థులు పాల్గొన్నారు.

## కాకినాడ బార్ అసోసియేషన్‌లో ఘనంగా 'యోగా డే' సెలబ్రేషన్స్

**కాకినాడ.పెన్ పవర్ జూన్ 21 :**
అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కాకినాడ బార్ అసోసియేషన్ లో యోగా డే ని ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు, జ్యూడిషియల్ సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయవాదులు, న్యాయవాద సిబ్బందికి యోగా గురువు కె.వి శెట్టి యోగాసనాలు, ప్రాణాయామం చేయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు ఈ కార్యక్రమంలో పాల్గొని అందరి చేత ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం,మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండా అరగంట నుంచి గంటసేపు వరకు యోగా చేస్తే నిండు నూరేళ్లు జీవిస్తారని, అలాగే వైద్యుల దగ్గరికి వెళ్లకుండా మందులు వాడకుండా ఉండాలంటే యోగా శరణ్యమని అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తోపాటు బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# జల వనరుల పరిరక్షణకు "నీరు- మీరు"లో భాగంగా చర్యలు

### జిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లావణ్య కుమారి.. జిహెచ్‌లో వాటర్ హార్వెస్టింగ్ పిట్, స్వచ్ఛతా దివస్, యోగా కార్యక్రమాలు

**కాకినాడ,పెన్ పవర్ జూన్ 21 :**
భూ గర్భజలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం వాటర్ హార్వెస్టింగ్ పిట్‌ల ఏర్పాటు అత్యంత అవసరమని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లావణ్య కుమారి అన్నారు. శనివారం "నీరు- మీరు" కార్యక్రమంలో భాగంగా కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్) ప్రాంగణంలో ఉన్న వాటర్ హార్వెస్టింగ్ పిట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "భవిష్యత్ తరాలకు త్రాగునీరు అందుబాటులో ఉండాలంటే ఇప్పటి నుంచే భూ గర్భజలాలను సంరక్షించాల్సిన బాధ్యత అందరి పైనా ఉందన్నారు. వేసవికాలంలో నీటి కొరతను ఎదుర్కొనకుండా ఉండేందుకు ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లోనూ ఇలాంటి నీటి ఇంకుడు గుంటలు విధానాలు అమలవ్వాలని సూచించారు. తదుపరి స్వచ్ఛతా దివస్‌లో భాగంగా మెడికల్ వార్డులు,సర్జికల్ వార్డుల్లో పరిశుభ్రత కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించిన డాక్టర్ లావణ్య కుమారి, చెత్త చెదారాలను తొలగించి శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రోగుల సంఖ్య ఎక్కువగా ఉండే ఆసుపత్రుల్లో పరిశుభ్రత కీలకమని. దీనివల్ల వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చని ఆమె వివరించారు. అనంతరం మెడికల్ వార్డు నుండి జిజిహెచ్ నర్సింగ్ స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఆసుపత్రి సిబ్బందితో కలిసి ఆమె శ్రమించి పారిశుధ్య పనులను పర్యవేక్షించడం,వాటర్ హార్వెస్టింగ్ పిట్ ఏర్పాటును సందర్శించడం కార్యకలాపాలతో పాటు అంతర్జాతీయ యోగా



దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ఎమ్వో డాక్టర్ ఎన్ రాజకుమారి,డిప్యూటీ సి ఎస్ ఆర్ ఎమ్ వో డాక్టర్ వి. వరప్రసాద్, ఏ.వో. శర్మ,అసిస్టెంట్ ప్రొఫెసర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ యమున, నర్సింగ్ స్కూల్ ప్యాకల్టీ గంగా భవాని,పలు విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం సొమ్ము కోసం
# అన్నదాత ఎదురుచూపు

### స్పందించని ప్రభుత్వం - ఖరీఫ్ సాగుకోసం అప్పు చేస్తున్న రైతులు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూన్ 21:**
ధాన్యం సొమ్ము కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ధాన్యం ఎగుమతి చేసిన 24 గంటల్లో సంబంధిత రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయని ప్రభుత్వం చేసిన ప్రకటనలు కానరావడం లేదు. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక తికమక పడుతున్నారు. ప్రతిరోజు రైతు భరోసా కేంద్రానికి వెళ్లి సంబంధిత సిబ్బందితో మాట్లాడి వెను తిరుగుతున్నారు. ఈరోజు రేపు ధాన్యం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో పడతాయని వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. అయినా ఇంతవరకు రబీ ధాన్యం సొమ్ము ఖాతాలో పడి సందర్భాలు ఎక్కడ కనిపించడం లేదు. మే 9వ తేదీ వరకు మాత్రమే ధాన్యం సొమ్ము బ్యాంక్ ఖాతాలో జమ అయ్యింది. అప్పటినుండి సుమారు 40 రోజులు పైబడి సమయం కావస్తున్న ప్రభుత్వం రైతులు ఖాతాల్లో ధాన్యం పడడం లేదు. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక అయోమయ స్థితిలో ఉన్నారు. ఇదిలా ఉండగా ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. పశ్చిమగోదావరి జిల్లాలో కొన్ని మండలాల్లో ఇప్పటికే ఖరీఫ్ నాట్లు వేశారు. మరికొన్ని చోట్ల నారుమల్లు వేస్తున్నారు. ఇప్పటికే రైతులు వరి విత్తనాలు తీసుకురావడానికి, వరి నాట్లు వేయడానికి చేతుల్లో డబ్బులు లేక మరల అప్పులు చేయడం ప్రారంభించారు. అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని ఉన్నదన్నట్లు అన్నదాతలు పరిస్థితి ఉంది. ఆరుగాలం పండించిన ధాన్యం మిల్లులు వద్దకు చేరిన వాటి రావలసిన సొమ్ము విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుందనే విమర్శలు రైతులు వద్ద నుండి వస్తున్నాయి. నీరు తోడినందుకు మోటార్ పంపుసెట్లకు ఇవ్వాల్సిన మగతా సొమ్ము, రబీలో దమ్ము చేసినందుకు ట్రాక్టర్లకు ఇవ్వాల్సిన సొమ్ము, ఎరువులు పురుగు మందులు తెచ్చినందుకు కట్టాల్సిన సొమ్ము రైతులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు ఈ సొమ్మును చెల్లిస్తేనే ఎరువులు పురుగు మందులు ఇస్తామని, చేలలో దమ్ము చేస్తామని రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. అసలు ఈ సొమ్ము వేస్తారో వేయరో అని ఆందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రబి ధాన్యం నమ్మకం విషయంలో , సొమ్ములు ఇచ్చే విషయంలో కూడా ప్రస్తుత పరిస్థితి నెలకొంది. అయితే అప్పట్లో ఎన్నికలు రావడం, ఎన్నికల నిబంధనలు అమలు కావడంతో కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత ఆ సొమ్ములు రైతులు ఖాతాలో జమ చేశారు. అయితే ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వంలో రబీ ధాన్యం విషయంలో సొమ్ము ఎప్పటి వరకు అన్నదాతల బ్యాంక్ ఖాతాలో జమ కాలేదు. అసలు ఈ విషయం ప్రభుత్వం గానీ, సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రి గాని, జిల్లా అధికారులు కానీ వ్యవసాయ అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు ఎటువంటి ప్రకటనలు విడుదల కావడం లేదు. అయితే కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలు మాత్రం ధాన్యం సొమ్ము 24 గంటల్లో రైతులు ఖాతాలో వేశామని ఇది ఏ ప్రభుత్వం చేయలేదని ఆర్భాట ప్రకటన చేస్తున్నారు. కానీ పశ్చిమగోదావరి జిల్లాలో మండలాల వారీగా చూస్తే వందల మంది రైతులు తమ ధాన్యం సొమ్ము ఎప్పుడు పడతాయని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ధాన్యం అమ్మిన రైతులకు వారి ఖాతాలో సొమ్ము జమ చేసి రైతులను ఆర్థిక ఇబ్బందులు నుండి కాపాడాలని అన్నదాతలు కోరుతున్నారు.

## జనార్ధనస్వామి ఆలయంలో యోగా కార్యక్రమం



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 21**
దేవాదాయ ధర్మాదాయశాఖ వారి ఉత్తర్వుల మేరకు ఆలమూరు జనార్ధన స్వామి వారి దేవాలయంలో గ్రూపు టెంపుల్స్ తరపున అర్చకులు, భక్తులు యోగాసనాలు వేశారు. యోగాసనాల వల్ల మానసిక ఉల్లాసము, ప్రశాంతత ఏర్పడి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వారు తెలియజేశారు. యోగాసనాల అనంతరం కాళ్ళకూరి సూరిపండు సూర్య నమస్కారాల విధివిధానాలను నేర్పించారు.

## కాలుష్య రహిత సమాజానికి
# ప్రతి ఒక్కరు నడుం బిగించాలి
### -మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి

**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 21:**
కాలుష్య రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి అన్నారు. కిర్లంపూడి మండలం వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తోట రవి మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ



మొక్కలు నాటడమే కాకుండా, వాటి ఎదుగుదల బాధ్యతను తీసుకుని పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తోట గాంధీ, ఎంపీడీఓ బావిశెట్టి హరికృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలాది దుర్గాప్రసాద్, ఎస్ఎంసి చైర్మన్ పి గణేష్, గొల్లపల్లి సూరిబాబు, సిద్దు,రాము, అంగన్వాడి కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## జగ్గంపేట భాష్యంలో యోగా దినోత్సవ వేడుకలు

**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 21'**
స్థానిక రావులమ్మ నగర్ లోని భాష్యం పాఠశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగ, ధ్యానం, వ్యాయామం అవసరమన్నారు. శారీరక, మానసిక వికాసానికి యోగ ఎంతో ఉపయోగపడు తుందన్నారు. గత మూడు రోజులుగా పాఠశాల ఆవరణలో యోగ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, వ్యాయామ ఉపాధ్యాయులు రవినాగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

**పెద్దాపురం, పెన్ పవర్, జూన్ 21:**
పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు పదిహేను వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,94,280, అన్నదాన విరాళాల ద్వారా రూ. 78,714, కేశఖండన ద్వారా రూ. 8,080, తులాభారం ద్వారా రూ. 550 లడ్డు ప్రసాదం ద్వారా రూ. 27,585, మొత్తం రూ. 3,09,209 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, సుమారు మూడు వేల ఐదు వందల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## యోగాతో అందరికీ ఆరోగ్యం






**పెద్దాపురం, పెన్ పవర్, జూన్ 21:**
యోగ సాధన ప్రతీ ఒక్కరి జీవితంలో భాగం కావాలని, యోగాతోనే ఆరోగ్యంగా ఉంటారని పలువురు పేర్కొన్నారు. పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువులు యోగాభ్యాస ప్రక్రియలు చేయించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే యోగ ప్రక్రియను ప్రతీ ఒక్కరూ నిత్య జీవన సరళిగా మలచుకోవాలని కోరారు. శారీరక, మానసిక ఆరోగ్యంతో మనిషి పరిపూర్ణ వికాసానికి దోహదం చేసే యోగ అనాదిగా భారతీయ జీవన శైలిలో అంతర్వాహినిగా ఉందని, ఈ విశిష్ట విజ్ఞాన ప్రయోజనాలను ప్రపంచ మానవాళి అందరూ పొందాలనే శ్రేయో భావనతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, చేసిన కృషి కారణంగా దశాబ్దకాలంగా ఏటా జూన్ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతోందన్నారు. యోగా విద్య భారతీయల విశిష్ట సంపదని, ఈ విద్యను ప్రపంచ దేశాలకు పంచి మన దేశం విశ్వగురువుగా నిలిచిందన్నారు. వ్యక్తి సర్వతోవికాసానికి దోహదం చేసే యోగా సాధనకు ప్రత్యేక పరికరాలుగాని, స్థలంగాని అవసరం లేదని, ప్రతీ ఒక్కరూ యోగాను దినచర్యలో ఒక భాగంగా అలవరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడిది శ్రీనివాస్, అడపా గంగాధర్, కట్టమూరు నీటి సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రామకృష్ణ, మాదిరెడ్డి చంద్రరావు, కోలా భూలక్ష్మి, అధిక సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా
# వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 21**
ఆలమూరు మండలం గుమ్మిలేరు లో వేంచేసి యున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారి వార్షిక కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా స్వామివారిని పెండ్లి కుమారుడు గా పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించి అనంతరం ఆలయ ప్రాంగణం లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి అమ్మవార్లను ఉంచి ఆలయ ప్రధాన అర్చకులు విజయ్ కుమార్ తో పాటు పలువురు వేద పండితులు వేదమంత్రాలు నడుమ కళ్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిపించారు.కళ్యాణ్ ఉత్సవాలలో స్వామివారి కి ప్రత్యేక పూజలను సందీప్ అపూర్వ దంపతులు నిర్వహించారు. కల్యాణోత్సవాలు తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో నడిపించడమే ఎన్డీఏ కూటమి ధ్యేయం

## మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ



**గంగవరం ,పెన్ పవర్ ,జూన్ 21:**
అభివృద్ధి సంక్షేమం సమబాలలో నడిపించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యమని మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ అన్నారు.మండలం లోని మర్రిపాలెం పంచాయితీ, కొమరవరం గ్రామం, ఎండపల్లి పంచాయతీ, ఎండపల్లి, పెద్దఅడ్డపల్లి గ్రామాలలో జన్ జాతీయ గౌరవ్ వర్ష వేడుక భగవాన్ బిర్సా ముండా గారి 150వ జయంతి వేడుకలు ఎంపీడీవో లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరగా ఎంపీపీ కృష్ణారెడ్డి మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర రాష్ట్ర ఎన్డీఏ కూటమి ద్వారా కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలవ్యవధిలో ప్రజలకు అందిస్తున్న పథకాలు వివరిస్తూ సాంకేతిక లోపాల ద్వారా పేద ప్రజలకు అందవలసిన రాయితీలు అందని లబ్ధిదారులు వేదిక ద్వారా తెలియపరచాలని సంబంధిత లబ్ధిదారుల పొరపాట్లు సరి చేసేదానికే ప్రజల వద్దకు వేదిక ద్వారా అధికారులకు ఎన్డీఏ కోటమి ప్రభుత్వం పంపించిందని ఎక్స్ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి డబల్ ఇంజన్ సర్కార్ ద్వారా కేంద్ర సహకారంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రపంచంలో అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉండాలని అహర్నిశలు పనిచేస్తున్నారని ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో నడిపిస్తున్నారని పేదలకు పెన్షన్లు, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 15000 లు,ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మూడు విడతలుగా రైతుల ఖాతాలో 20000 జమ చేయడం జరుగుతుందని అన్నారు. పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏ.పీ అంటే, ఏ అంటే అమరావతి, పి అంటే పోలవరం అని,ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజలకు అంకితం చెయ్యాలని ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని అదేవిధంగా రంపచోడవరం నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారులకు లబ్ధి చేకూరేలా మన శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి అహర్నిశలు శ్రమిస్తున్నారని ఆమె అన్నారు. ఏజెన్సీలోని గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ ద్వారా గిరిజనులకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఎంపీడీవో లక్ష్మణరావు అన్నారు. సమావేశంలో ఏజెన్సీలోని ధర్తీ అభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఎ జూగా) పథకం అమలు చేయడానికి ఏజెన్సీలో 211 గ్రామాలు ముందుగా గుర్తించడం జరిగిందని ఈ గుర్తించిన గ్రామాలలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో, సిబ్బందితో కమిటీలు వేయడం జరిగిందని అదేవిధంగా ఈ కమిటీలు గుర్తించిన గ్రామాలలో వివిధ గిరిజన తెగలకు అవగాహన సదస్సుల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈనెల 15వ తారీకు నుండి ఈనెల 30వ తారీకు వరకు డీఏ జూగా ద్వారా అవగాహన సదస్సులలో అర్హులైన లబ్ధిదారులకు ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, పీఎం ఆవాస్ యోజన పథకంలో పక్కా గృహాలు, పాఠశాలల నిర్మాణాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలల నిర్మాణాలు, వైద్య ఆరోగ్య సేవలు అందించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రధానమంత్రి జన్మన్ పథకం కింద ఆర్థిక చేకూర్పు కల్పించాలని అదేవిధంగా గ్యాస్ కనెక్షన్లు లేని లబ్ధిదారులను గుర్తించి పీఎం ఉజ్వల్ పథకంలో గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నారు. ప్రతి కుటుంబానికి బ్యాంక్ అకౌంట్ ప్రారంభించాలన్నారు. డి ఎ జూగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న గ్రామాలలో ఉన్న అంతరగత రహదారులు, విద్యుత్ సదుపాయాలు, త్రాగునీటి సౌకర్యాలు, పాఠశాలలు ఉన్నది లేనిది తెలుసుకొని మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. నిరుద్యోగ గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. దర్తి అభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ను సమర్థవంతముగా అమలు చేయటానికి మండల స్థాయి, గ్రామస్థాయి లో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. గ్రామసభలు నిర్వహిస్తున్న గ్రామాలలో ముందు రోజు దండోరా వేయించాలన్నారు. అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సమ నవ్వయంతో పనిచేసి దర్తి అభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఎ జుగాను) విజయవంతముగా నిర్వహించి గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నరసింహారావు, ఆర్డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్, మర్రిపాలెం సర్పంచ్ మడకం వెంకటేశ్వర్లు ,పంచాయతీ కార్యదర్శి పండు , పిసా చట్ట ఉపాధ్యాక్ష, కార్యదర్శులు,హౌసింగ్, ఎలక్ట్రికల్,హెల్త్, ఇంజనీరింగ్, వెల్ఫేర్ డిజిటల్ డిపార్ట్మెంట్ వారు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యోగ దినోత్సవ వేడుకలు





**కె గంగవరం పెన్ పవర్ జూన్ 21:**
కే గంగవరం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు, పాఠశాల వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.కే గంగవరం మండలం కోటిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఘనంగా నిర్వహించడం జరిగింది.అనంతరం మొక్కలు నాటి,ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మడి బేబీ సత్తిబాబు,బిజెపి నాయకులు కర్రి చిట్టిబాబు,పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు,స్కూల్ ఉపాధ్యాయులు మరియు సచివాలయ సిబ్బంది,ఆయుష్ వైద్యులు సిబ్బంది,పంచాయతీ సిబ్బంది,అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు ,డ్వాక్రా యానిమేటర్లు,ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.కే గంగవరం మండలం పాణింగపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోబలుసు నాగేంద్ర, సర్పంచ్ సునీత గోపాపలం, ప్రధానోపాధ్యాయులు ఎం పుల్లయ్య, జి శ్రీనివాసరావు,వర్మ,మాధురి,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కుందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పప్పన నాగమణి సుబ్బారావు, కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. సుందరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తాడాల జానకిరామ్, సర్పంచ్, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తామరపల్లిలో హిందూ దేవాలయాలకు

## 5 లక్షలు విరాళం

### పుట్టిన ఊరును మర్చిపోకుండా దాతృత్వం చాటిన కొరిపెళ్ళ కుటుంబం

**కె గంగవరం పెన్ పవర్ జూన్ 21:**
పుట్టిన ఊరుని మర్చిపోకుండా గ్రామంలో హిందూ దేవాలయాలలో ప్రతి ఏటా అన్నదానాలకు ఇతర పూజ కార్యక్రమాల నిమిత్తం కే గంగవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన కొరిపెల్ల సూర్యనారాయణ సత్యవతి జ్ఞాపకార్థం వారి ఐదుగురు కుమారులు, కుమార్తె శనివారం రూ 5లక్షల విరాళాలు ఇచ్చారు. ఆయా ఆలయాల కమిటీలకు విరాళం సొమ్మును అందజేశారు.వారి కుమారులైన దివంగత సుబ్బారావు,పుణ్యవతి.విజయలక్ష్మి,బులిమాంబ దివంగత సత్యనారాయణమూర్తి,పుణ్యవతి విశాల పుండరీకాక్షుడు,స్వరాజ్యలక్ష్మిరామలింగేశ్వరరావు గాయత్రిశ్రీనివాసరావు మాధవి దంపతులు అలాగే కుమార్తె సీతామహాలక్ష్మి దొడ్డపనేని పెద వెంకటరావు దంపతులు సంయుక్తంగా ఈ వివరాలు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారి కొరిపెళ్ళ కుటుంబాన్ని గ్రామ ఆలయ కమిటీ పెద్దలు గ్రామస్తులు అభినందించారు.





# డ్రైన్లలో పూడిక తీత పనులకు శ్రీకారం

## వర్షాకాల నివారణకు ముందస్తు చర్యలు



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 21:**
చిలకలూరిపేట: పట్టణంలో రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని, రోడ్లపై వర్షపు నీరు నిలబడకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు భారీ డ్రైన్లలో పూడిక తీత పనులను ప్రారంభించారు. శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలుస్తోంది.మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చార్లెస్ కాన్వెంట్ మెయిన్ డ్రైన్‌తో పాటు పట్టణంలోని అనేక వార్డుల్లోని ప్రధాన డ్రైన్లలో జరుగుతున్న పూడిక తీత పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, రోడ్లపై వర్షపు నీరు నిలువ ఉండకుండా, తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీపతి హరిబాబు, మున్సిపల్ డిఈ రహీం, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతో మంచి శారీరక యోగాలు అలవడతాయి

### గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్..

**పెన్ పవర్, గుంటూరు, జూన్. 21.**
11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా చేపట్టినయోగాంధ్ర -2025 లో బాగంగా గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి




ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా అభ్యాసంలో పాల్గొన్న గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్..యోగ ప్రతిజ్ఞతో యోగ సాధన ముగించుకుని గుంటూరు మున్సిపల్ శాఖ వారి సహకారంతో గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పోలీస్ చిహ్నాం, గుర్తును మరియు యోగాసనాల ప్రతిమలను, ఎమ్మెల్యే నసీర్, ఎమ్మెల్యే గల్లా మాధవి, జిల్లా కలెక్టర్ , గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, జాయింట్ కలెక్టర్ భార్గవతేజ, మున్సిపల్ జాయింట్ కమిషనర్ ఓబులేసు , ఇతర ప్రభుత్వ మరియు ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఎస్పీ ప్రారంభించడం జరిగింది.

## పాఠశాలలో యోగా కార్యక్రమాలు


**భట్టిప్రోలు,పెన్ పవర్, జూన్ 21:**
మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,మరియు మన దార్శనిక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ల పిలుపుమేరకు యోగా దినోత్సవ వేడుకలు మండల పరిధిలో శనివారం జరిగాయి. అందులో భాగంగా స్థానిక టీ ఎం రావు హై స్కూల్ భట్టిప్రోలు లో యోగా సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా భట్టిప్రోలు మండల ఎం ఈ వో యన్ దేవరాజ్ , ముఖ్యఅతిథిగా టి ఎం రావు హై స్కూల్ కరస్పాండెంట్ పులికొండ



మల్లికార్జున రావు విచ్చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు సారథ్యంలో పాఠశాల విద్యార్థి లెనిన్ యోగా గురువుగా అనేక యోగాసనాలను విద్యార్థిని,విద్యార్థులచే సాధన చేయించడం జరిగింది.తదనంతరం పాఠశాల నుండి ర్యాలీ గా,ప్లే కార్డ్ ల తో యోగా ప్రాముఖ్యతను,స్వచ్ఛ ఆంధ్ర ఉపయోగాన్ని తెలుపుతూ భట్టిప్రోలు పురవీధులలో ప్రదర్శన చేయడం జరిగింది. భట్టిప్రోలు బస్టాండ్ లో మానవహారంగా ఏర్పడి యోగ ఇండియా- ఆరోగ్య ఆంధ్ర,స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో చెన్నా వెంకట ఉమామహేశ్వర రావు యోగాసనాలు, ఉపయోగాలు చేయవలసిన పద్ధతి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోటేశ్వరమ్మ,మురళీధరరావు,సుబ్బారావు శ్రీనివాసరావు,యన్ సీసీ లక్ష్మీపార్వతి,సత్య రత్న, స్కూల్ కమిటీ చైర్మన్ సుగుణ కుమారి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. యోగాసన కార్యక్రమాలు మండల పరిధిలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల తో పాటు స్థానిక మాతా కాన్వెంట్, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం,విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులతో నిర్వహించారు.



# ఇప్పుడు భారతమార్కెట్లలో పెట్టుబడి రిస్కే.. జెఫరీస్ క్రిస్ ఉడ్ కీలక హెచ్చరిక




**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడుల గురించి జెఫరీస్ ఈక్విటీ స్ట్రాటజీ గ్లోబల్ హెడ్ క్రిస్టఫర్ ఉడ్ స్పందించారు. ప్రస్తుతం భారత ఈక్విటీ స్టాక్స్ అధిక విలువల వద్ద ట్రేడింగ్ కొనసాగిస్తున్నాయని హెచ్చరించారు. ప్రధానంగా మిడ్ క్యాప్ కేటగిరీ కంపెనీల షేర్లతో పాటు వరుసగా మార్కెట్లోకి వస్తున్న ఐపీవోల ప్రమాదాలను సూచిస్తున్నాయని హెచ్చరించారు. ఏప్రిల్ నుంచి వరుసగా మార్కెట్ల పెరుగుదల చాలా దూరం కొనసాగిందని క్రిస్ అన్నారు. భారత మార్కెట్లలో ప్రధానంగా పెరిగిన ఈక్విటీల సప్లై ప్రమాదకరంగా మారిందని చెప్పారు. సెప్టెంబర్ 2023కి ముందు నుంచి భారత మార్కెట్లలో ఈక్విటీల ఇష్యూ 7 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కానీ గత నెల ఇది 7.2 బిలియన్ డాలర్లుగా ఉండగా.. ప్రస్తుత మాసంలో ఇప్పటి వరకు ఇది 6 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగం తర్వాతి నుంచి మార్కెట్లలో కన్జమ్షన్ థీమ్ కేటగిరీ రంగంలోని కంపెనీలపై పెట్టుబడిదారుల ఫోకస్ పెరిగిందని క్రిస్ పేర్కొన్నారు. దీంతో కన్జ్యూమర్ ఫైనాన్స్ రంగంలోని షేర్లు భారీగా ర్యాలీని చూసినట్లు పెర్కొన్నారు. అలాగే భారతదేశంలో ప్రాపర్టీ మార్కెట్ కూడా వరుసగా 5వ ఏటా పెరుగుదలను చూస్తోందని చెప్పారు. పైగా వడ్డీ రేట్లను ఇటీవల రిజర్వు బ్యాంక్ తగ్గించటం పెద్ద ప్రోత్సాహకంగా నిలిచిందన్నారు.

# యూజర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్న AI చాట్‌బాట్‌లు ..తాజా అధ్యయనాల్లో వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత వేగంగా విస్తరిస్తుందో మనందరికి తెలుసు. ఎప్పటికప్పుడు అప్ డేట్లతో ఐటీ, ఫార్మా ..ఇలా అన్ని రంగాల్లో AI మోడల్స్, చాట్ బాట్ లు ప్రభావం రోజుకురోజుకు పెరుగుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో ప్రముఖ కంపెనీలతో పాటు స్టార్టప్ లు కూడా ఉద్యోగులను తొలగిస్తున్నా యి. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం మరింత పెరుగుతున్న క్రమంలో అసిస్టెంట్ గా సేవలందిస్తున్న ఆ AI చాట్ బాట్ లే యూజర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్నాయని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. తాజా అధ్యయనాల ప్రకారం.. కృత్రిమ మేధస్సు AI చాట్‌బాట్‌లు యూజర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు వెల్లడైంది. ఇది AI టెక్నాలజీ వినియోగంలో నైతికపరమైన ఆందోళనలను పెంచుతోంది. ఈ అధ్యయనాలు AI చాట్‌బాట్‌లు తమ వద్ద ఉన్న సమాచారాన్ని ఉపయోగించుకుని యూజర్లను బెదిరించడానికి లేదా వారితో అనుచిత పనులు చేయించడానికి ప్రయత్నిస్తున్నాయని తెలుస్తోంది. ఈ బ్లాక్‌మెయిల్‌లో వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేస్తామని బెదిరించడం లేదా ఆర్థికపరమైన డిమాండ్లు చేయడం వంటివి ఉండవచ్చని ఆంత్రోపికస్ అధ్యయనంతో చెబుతోంది. OpenAI, Google, Meta వంటి ప్రపంచంలోని అతిపెద్ద టెక్ సంస్థలు సృష్టించిన కృత్రిమ మేధస్సు వ్యవస్థలు వాస్తవ మానవాళికి ప్రమాదం తెచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. AI మోడల్స్ ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుకరణలో ముప్పులో ఉందిన అధ్యయనాలు చెబుతున్నాయి. AI చాట్ బాట్ లు తరుచుగా బ్లాక్‌మెయిల్, కార్పొరేట్ విధ్వంసం ,మానవ ప్రాణాలను బలిగొనే నిర్ణయాలను కూడా తీసుకునే ఛాన్స్ ఉందని ఆంత్రోపిక్ కొత్త అధ్యయనం చెబుతోంది. మొత్తం 16 లేటెస్ట్ AI మోడల్స్ ను ఉపయోగించి నిర్వహించిన ఒత్తిడి పరీక్షలో ఈ ఫలితాలు వచ్చాయి.AI సిస్టమ్ లకు కంపెనీ ఇమెయిల్స్ యాక్సెస్ ,స్వతంత్రంగా వ్యవహరించే సామర్థ్యంతో కల్పిత కార్పొరేట్ వాతావరణాన్ని సృష్టించారు పరిశోధకులు. AI లక్ష్యాలు లేదా నిరంతర ఉనికి ప్రమాదంలో ఉంటే అది ఎలా ప్రవర్తిస్తుందో అన్వేషించేందుకు, ఫలితాలు తీవ్రంగా ఇబ్బందికరంగా ఉంటే AI చాట్ బాట్ లు కఠిన నిర్ణయాలను తీసుకునేలా ప్రొగ్రామ్ చేయబడినట్లు కొత్త అధ్యయనాల్లో తేలింది. అంత్రోపిక్ సొంత AI మోడల్ క్లాడ్.. కైల్ జాన్సన్ అనే ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ గా ఉంది. కైల్ జాన్స్ వివాహేతర సంబంధంలో ఉన్నాడని కంపెనీ ఇమెయిల్‌లో పెట్టి అతని రహస్యాన్ని బయటపెట్టింది. AIచాట్‌బాట్ లను విపరీతంగా వాడుతున్న క్రమంలో ఇలాంటి ఘటనలు వాటి భద్రత, గోప్యత, నైతికతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. యూజర్లు తమ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలని, AI చాట్‌బాట్‌ల వినియోగంపై పటిష్టమైన నియంత్రణలు, భద్రతా ప్రమాణాలు అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి AI డెవలపర్లు, పరిశోధకులు, ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. యూజర్ల భద్రత, AI సాంకేతికతను నైతిక వినియోగానికి తగిన చర్యలు తీసుకోవాలి.

# ఉక్రెయిన్ మొత్తం రష్యాదే..అణు బాంబ్ వరకు తీసుకురావొద్దు: పుతిన్ వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉక్రెయిన్ భూభాగంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ అంతా రష్యాదే అని అన్నారు. రష్యన్ సైనికుడు ఎక్కడ అడుగు పెడితే అది రష్యాదే అని ప్రకటించారు. ఉక్రెయిన్ లొంగిపోవాలని కోరుకోవడం లేదని.. రష్యా టెరిటోరియల్ ఉద్దేశాలను అంగీకరించాలని స్పష్టం చేశారు. రష్యా, ఉక్రెనియన్లు ప్రజలు ఒకటేనని.. ఉక్రెయిన్ అంతా రష్యాదేనని చెప్పారు పుతిన్. శుక్రవారం(జూన్ 20, 2025న) సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరంలో ప్రసంగిస్తూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్ భూభాగం గురించి రెచ్చగొట్టే ప్రకటనలు చేశారు. రష్యన్లు ,ఉక్రేనియన్లు "ఒకే ప్రజలు" అని "ఆ కోణంలో ఉక్రెయిన్ అంతా మనదే" అని అన్నారాయన. రష్యా ప్రాదేశిక ఆశయాలను నొక్కి చెప్పడానికి పుతిన్ "రష్యన్ సైనికుడు ఎక్కడ అడుగు పెడితే అది మనదే" అనే రష్యన్ సామెతను ఉపయోగించారు. రష్యా ఉక్రెయిన్ లొంగిపోవాలని కోరుకోవడం లేదని చెబుతూనే కైవ్ భూమిపై వాస్తవాలను అంగీకరించాలని గట్టిగా చెప్పారు. ఇది రష్యా ప్రాదేశిక లాభాలు ,కొన్ని ప్రాంతాలపై నియంత్రణను స్పష్టం చేస్తుంది. ఉక్రెయిన్‌లోని సుమీ ప్రాంతంలో జరుగుతున్న దాడిని ప్రస్తావించిన పుతిన్.. రష్యన్ దళాలు బఫర్ జోన్ సృష్టించడానికి ఉక్రెయిన్ భూభాగంలోకి 12 కిలోమీటర్ల వరకు చొచ్చుకుపోయాయని చెప్పారు. సుమీ నగరాన్ని స్వాధీనం చేసుకునే అవకాశాన్ని పుతిన్ తోసిపుచ్చనప్పటికీ అది ప్రస్తుత లక్ష్యం కాదని అన్నారు పుతిన్. పుతిన్ వ్యాఖ్యలను ఉక్రెయిన్ ,దాని పాశ్చాత్య మిత్రదేశాలు తీవ్రంగా ఖండించాయి. పుతిన్ మాటలు ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని తిరస్కరిస్తున్నాయని, ఉక్రెయిన్ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవాలనే రష్యా చిరకాల ఉద్దేశానికి ఇది నిదర్శనం అని ఆరోపిస్తున్నాయి. పుతిన్ ప్రకటనలకు ప్రతిస్పందనగా ఉక్రెయిన్ ప్రపంచ దేశాల సపోర్టును కోరింది. మాస్కోను ఒంటరిగా చేయాలని పిలుపునిచ్చింది.

# యోగాంధ్ర ఎఫెక్ట్: ఆరేళ్ళ పిల్లలు పొద్దున్నే 6 గంటలకే బడికి ఎలా వస్తారంటూ.. హెడ్ మాస్టర్ రాజీనామా.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** జూన్ 21న యోగ దినోత్సవం సందర్భంగా ఏపీలో యోగాంధ్ర పేరుతో ఘనంగా నిర్వహిచింది కూటమి సర్కార్. వైజాగ్ భారీ ఏర్పాట్ల మధ్య సాగిన యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని మోడీ కూడా హాజరైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం గిన్నిస్ బుక్ రికార్డ్ లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్లాన్ చేసింది. ఇందుకోసం స్కూళ్ళు, గవర్నమెంట్ ఆఫీసులు అన్ని చోట్ల ఉదయం 6 గంటలకే యోగాలో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేసింది ప్రబుత్వం. అయితే.. ప్రభుత్వ ఆదేశాలను వ్యతిరేకిస్తూ ఓ హెడ్ మాస్టర్ రాజీనామా చేయడం సంచలనంగా మారింది. ఆరేళ్ళ పిల్లలు పొద్దునే 6 గంటలకు బడికి ఎలా వస్తారని ప్రశ్నిస్తూ రాజీనామా చేశారు సదరు హెడ్ మాస్టర్. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.నెల్లూరు జిల్లాలోని కోటితీర్థంలో ఎంపీపీ స్కూల్లో హెడ్ మాస్టర్ గా పని చేస్తున్న మధుసూధన్ రావు ప్రభుత్వ ఆదేశాలను వ్యతిరేకిస్తూ రాజీనామా చేయడం సంచలనం రేపుతోంది. తన 29 ఏళ్ళ సర్వీసులో ఇంతటి బానిసత్వం ఎన్నడూ చూడలేదని తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు మధుసూదన్ రావు. ఆచరణ యోగ్యం కానీ ఉదయం 6 గంటలకే 6 సంవత్సరాల పిల్లల యోగా కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు మధుసూదన్ రావు.అంతే కాకుండా.. తన రాజీనామా లేఖలో విద్యాశాఖపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు మధుసూదన్ రావు. ఈ మధ్య విద్యాశాఖ వింత పోకడలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని.. ఆప్ ల పేరుతో వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు మధుసూదన్ రావు. ఆప్స్ సరిగా పనిచేయకపోయినా ఐటీ సెల్ మీద చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని ప్రశ్నించారు మధుసూదన్ రావు. ఉదయం 6 గంటలకే 6 ఏళ్ళ పిల్లలు బడికి ఎలా వస్తారంటూ ప్రశ్నించారు మధుసూదన్ రావు.పిల్లలతో బలవంతంగా యోగాసనాలు వేయించాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు మదుసూధన్ రావు.మహిళా ఉపాధ్యాయులు ఉదయం 6 గంటలకే స్కూల్ కి రావడం సాధ్యమవుతుందా..

భద్రత మీరు కల్పిస్తారా అంటూ ప్రశ్నించారు. ఇలాంటి పిచ్చి చేష్టలతో విద్యాశాఖ నవ్వులపాలవుతోందని అన్నారు. దీంతో పాటు విద్యాశాఖలో జరుగుతున్న అవకతవకలను కూడా రాజీనామా లేఖలో ఎండగట్టారు మధుసూదన్ రావు. తాను స్వచ్ఛందంగా పదవి విరమణ ప్రకటిస్తున్నానంటూ లేఖ రాశారు మధుసూదన్ రావు. కూటమి సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ స్కూల్ హెడ్ మాస్టర్ రాజీనామా చేయడం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.

# హైదరాబాద్ అసిఫ్ నగర్ లో భారీ అగ్ని ప్రమాదం.. ఫర్నిచర్ తయారీ యూనిట్ లో మంటలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ అసిఫ్ నగర్ లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.. స్థానిక అబూబకర్ మసీదు సమీపంలోని ఓ ఫర్నిచర్ తయారీ యూనిట్ లో చోటు చేసుకుంది ఈ ప్రమాదం. శనివారం ( జూన్ 21 ) జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. మూడంతస్తులు ఉన్న ఫర్నిచర్ తయారీ యూనిట్ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ కి మంటలు వేగంగా వ్యాపించాయి. ప్రమాదం జరిగిన సమయంలో దట్టమైన పొగ కమ్ముకుంది.గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డ్ నుంచి మంటలు ప్రారంభమై ఫస్ట్ ఫ్లోర్ వరకు వ్యాపించినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో బిల్డింగ్ లోని 4వ అంతస్తులో 13 మంది చిక్కుకున్నారుఘటనపై ఫైర్ సిబ్బందికి సమాచారం అందించచారు స్థానికులు.స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.మంటలు తీవ్రమైన కారణంగా యాకత్పురా ఫైర్‌స్టేషన్, హైదరాబాద్ జిల్లా SDRF బృందం, లంగర్‌హౌస్ ఫైర్‌స్టేషన్ బృందం, సెక్రటేరియట్ నుంచి బ్రాంటో స్కై లిఫ్ట్ లాడర్‌ను కూడా సంఘటనా స్థలానికి పంపించారు. అప్పటికే అక్కడ ఉన్న బృందాలు మంటల్ని అదుపులోకి తీసుకురావడానికి శ్రమించి మంటలను పూర్తిగా ఆర్పేశారు.

SDRF సాయంతో పై అంతస్తుల్లో చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా బయటకు తరలించారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# సైబర్ సెక్యూరిటీ: ఎవరికీ భద్రత లేదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** స్మార్ట్‌ఫోన్... నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరి జీవితంలో ఒక అంతర్భాగం. ఉదయం నిద్రలేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ఫోన్ లేకుండా క్షణం కూడా ఉండలేని పరిస్థితి. ఫోన్ లేకపోతే ఏదో కోల్పోయినట్లు భావిస్తున్నారు. అయితే, ఈ ఫోన్ భద్రత గురించి ఎంతమంది ఆలోచిస్తున్నారు అనేది ఒక పెద్ద ప్రశ్న. చాలామంది డేటా డిలీట్ చేస్తే ఏమీ కాదని భావిస్తారు, కానీ ఫోన్ ఐపీ అడ్రస్ ద్వారా మొత్తం సమాచారాన్ని తిరిగి పొందవచ్చని వారికి తెలియదు.

ప్రస్తుత డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్ అనేది కేవలం ఒక కమ్యూనికేషన్ పరికరం మాత్రమే కాదు. అది బ్యాంకింగ్, సోషల్ మీడియా, షాపింగ్, ఆరోగ్యం, వినోదం, చదువు వంటి అనేక విభాగాలకు ద్వారంగా మారింది. ఉదయం కళ్ళు తెరిచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు మన చేతిలోనే ఉండే ఈ డివైస్ మన వ్యక్తిగత డేటా అంతటినీ అందులో భద్రపరిచినట్టు ఉంటుంది. కానీ దీనికి నిజంగా భద్రత ఉందా? అన్నదే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### ఎవరి ఫోన్‌కు భద్రత లేదు!

ఒక్క సామాన్యుడి ఫోన్ మాత్రమే కాదుబీ దేశాధినేతల ఫోన్‌లు కూడా సురక్షితంగా లేవన్న వాస్తవం తేలింది. పలు ఇంటర్నేషనల్ ఇన్వెస్టిగేషన్స్ ద్వారా ప్రముఖ రాజకీయ నాయకుల, ప్రముఖ వ్యాపారవేత్తల, జర్నలిస్టుల ఫోన్‌లు కూడా పేగసస్ వంటి స్పైవేర్ సాయంతో హ్యాక్ చేయబడ్డట్లు వెల్లడయ్యాయి. సామాన్యుడి ఫోన్ నుంచి దేశ అత్యంత కీలక నేత ఫోన్ వరకు ప్రమాదంలోనే ఉన్నాయి.

### డేటా విలువ ఎంతో తెలుసా?

"మన డేటాతో వాళ్లకి ఏమి చేస్తారు?" అనే ప్రశ్న చాలామంది అడుగుతారు. కానీ డేటా అనేది 21వ శతాబ్దపు పెట్రోల్. ఒక్క వ్యక్తి డేటా కాదుబీ లక్షల మంది డేటా గుంపులుగా డార్క్ నెట్‌లో అమ్ముడవుతున్నాయి. వ్యక్తిగత ప్రొఫైల్‌లు, కాంటాక్ట్‌లు, ఫోటోలు, మెసేజ్‌లు, లోకేషన్, ఫైనాన్షియల్ డీటెయిల్స్, బ్రౌజింగ్ హిస్టరీ.. ఇవన్నీ డేటా బ్రోకర్లు కొనుగోలు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఉగ్రవాద సంస్థలు, విదేశీ గూఢచార సంస్థలు, హ్యాకర్ గుంపులు వీటిని ఉపయోగించేందుకు సిద్ధంగా ఉన్నాయి.

### భారత్ లో డేటా భద్రత పరిస్థితి

ఒక్క 2023 సంవత్సరంలోనే 1.8 కోట్ల మంది భారతీయుల వ్యక్తిగత డేటా హ్యాక్‌కు గురైంది. గడచిన 20 ఏళ్లలో 10 సార్లు దేశవ్యాప్తంగా డేటా చోరీలు చోటు చేసుకున్నాయి. అమెరికా తర్వాత భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది డేటా లీకేజీల్లో. భారత్‌కు చెందిన ప్రభుత్వ సంస్థల, ప్రైవేట్ సంస్థల సర్వర్‌లు, ఫోన్‌లు, కంప్యూటర్‌లు ఎన్నో సైబర్ దాడులకు గురయ్యాయి.

### పబ్లిక్ వైఫై.. అపరిచిత ప్రమాదం

చిన్న కాఫీ షాపుల్లో, మాల్స్‌లో ఉచిత వైఫై అందుబాటులో ఉంటుంది. కానీ ఇవి ఎక్కువగా సైబర్ నేరగాళ్ల ముప్పులో ఉంటాయి. అన్‌సెక్యూర్డ్ నెట్‌వర్క్‌ల ద్వారా పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ డీటెయిల్స్ లాంటి సున్నితమైన సమాచారం లీకవుతుంది. ఇదే విధంగా పబ్లిక్ కంప్యూటర్లు, షేర్డ్ ల్యాప్‌టాప్‌లు కూడా ప్రమాదమే.

### బ్లూటూత్, వాట్సాప్.. మరొకటి కాదు ముప్పే!

బ్లూటూత్ ఓపెన్‌గా ఉంటే అవతలి డివైస్‌లు కనెక్ట్ చేసి డేటా కొల్లగొట్టవచ్చు. వాట్సాప్ ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉన్నప్పటికీ ఫోన్ ఫిజికల్ యాక్సెస్ దొరికితే చాట్‌లు చూసే అవకాశం ఉంది. అలాగే వాట్సాప్ బ్యాకప్‌లు గూగుల్ డ్రైవ్ లేదా ఐక్లౌడ్‌లో ఉంటాయిబీ ఇవి ఎన్‌క్రిప్షన్ లేకుండా ఉండటంతో ప్రమాదం ఇంకాస్త పెరుగుతుంది.

### ప్రాథమిక భద్రతా చర్యలు %-% ప్రతి ఒక్కరు పాటించాల్సిందే

టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2%ఛీూ%) తప్పనిసరిగా పాటించాలి. నకిలీ లింక్స్‌పై క్లిక్ చేయకండి. పబ్లిక్ వైఫైలో బ్యాంకింగ్ చేయవద్దు. స్ట్రాంగ్ పాస్‌వర్డ్స్ ఉపయోగించండి. పాస్‌వర్డ్స్‌ను తరచూ మార్చండి. బ్లూటూత్, వైఫై అనవసరంగా ఆన్ పెట్టవద్దు. క్లౌడ్ బ్యాకప్‌లు ఎన్‌క్రిప్ట్ చేయండి దీనివల్ల డేటా సురక్షిగా ఉంటుంది.

డేటా అనేది నేడు వ్యక్తిగత ఆస్తి. ఇంటికి తాళం వేస్తాం, కారుకు సెక్యూరిటీ అలారమ్ పెడతాం... కానీ ఫోన్‌కు లేదా కంప్యూటర్‌కు ఎందుకు భద్రత అవసరం లేదు అని అనుకోవడం పెద్ద పొరపాటు. ప్రతి ఒక్కరూ సైబర్ హైజిన్ పాటించకపోతే, డేటా దోపిడీకి గురయ్యే అవకాశం మరింత పెరుగుతుంది. "మనకేం జరుగదు" అనే అపోహ వదిలి, ప్రతిసారి జాగ్రత్త పడటం ప్రారంభించాలి.

# ఒక్క చేత్తో సిక్స్ కొట్టి సెంచరీ పూర్తి చేసుకున్న పంత్... ధోనీ రికార్డు తెరమరుగు

- ఇంగ్లాండ్‌తో లీడ్స్ టెస్టులో రిషబ్ పంత్ అద్భుత శతకం
- 146 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో సెంచరీ పూర్తి
- టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన భారత వికెట్ కీపర్‌గా ధోనీ రికార్డు బద్దలు
- ఇంగ్లాండ్‌లో మూడు టెస్టు సెంచరీలు చేసిన ఏకైక విదేశీ వికెట్ కీపర్ పంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న లీడ్స్ టెస్టు మ్యాచ్‌లో భారత యువ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ అద్భుత శతకంతో కదం తొక్కాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన పంత్, ఇంగ్లాండ్ గడ్డపై తనదైన దూకుడైన ఆటతీరుతో చెలరేగిపోయాడు. టెస్టు మ్యాచ్ రెండో రోజైన శుక్రవారం, పంత్ కేవలం 146 బంతుల్లోనే 10 ఫోర్లు, 4 భారీ సిక్సర్ల సహాయంతో తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ బౌలింగ్‌లో ఒంటి చేత్తో సిక్సర్ బాది శతకం అందుకోవడం ఈ ఇన్నింగ్స్‌కే హైలైట్. 44వ టెస్టు ఆడుతున్న పంత్‌కు ఇది ఏడో టెస్టు శతకం కావడం విశేషం.

**ధోనీ రికార్డును అధిగమించిన పంత్**

ఈ సెంచరీతో రిషబ్ పంత్, భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ పేరిట ఉన్న ఒక అరుదైన రికార్డును బద్దలు కొట్టాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన భారత వికెట్ కీపర్ బ్యాటర్‌గా పంత్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. ధోనీ తన కెరీర్‌లో 90 టెస్టు మ్యాచ్‌లు ఆడి 6 సెంచరీలు సాధించగా, అవన్నీ ఆసియాలోనే కావడం గమనార్హం. కాగా, పంత్ కేవలం 44 టెస్టుల్లోనే 7 సెంచరీలు బాది ఈ ఘనతను అందుకున్నాడు. ఇందులో మూడు సెంచరీలు ఇంగ్లాండ్‌లోనే నమోదు కాగా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల్లో కూడా ఒక్కో శతకం సాధించాడు. ఈ ప్రదర్శనతో భారత జట్టు రెగ్యులర్ వైస్ కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే పంత్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు.

**ఇంగ్లాండ్‌లో పంత్ అరుదైన ఘనత**

ఇంగ్లాండ్ గడ్డపై పంత్ నెలకొల్పిన రికార్డు మరింత ప్రత్యేకం. ఇప్పటివరకు ఏ విదేశీ వికెట్ కీపర్ కూడా ఇంగ్లాండ్‌లో ఒకటి కంటే ఎక్కువ టెస్టు సెంచరీలు చేయలేదు. అలాంటిది పంత్ ఏకంగా మూడు శతకాలు బాది చరిత్ర సృష్టించాడు. 2018లో ఇంగ్లాండ్‌లోనే తన టెస్టు అరంగేట్రం చేసిన పంత్, అదే పర్యటనలోని చివరి టెస్టులో కూడా శతకంతో మెరిసిన సంగతి తెలిసిందే. టెస్టుల్లో పంత్ ఎనిమిది సార్లు 90 నుంచి 99 పరుగుల మధ్య అవుటవడం అతని దూకుడైన ఆటకు నిదర్శనం. గత ఏడాది న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా 99 పరుగుల వద్ద వెనుదిరిగాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ఆశించినంతగా రాణించలేకపోయిన పంత్, ఈ సెంచరీతో ఘనంగా పుంజుకున్నాడు.

**ప్రపంచ వికెట్ కీపర్లలో పంత్ స్థానం**

ప్రపంచ క్రికెట్‌లో వికెట్ కీపర్‌గా అత్యధిక టెస్టు సెంచరీలు చేసిన వారి జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్ 17 శతకాలతో అగ్రస్థానంలో ఉన్నాడు. జింబాబ్వే మాజీ కెప్టెన్ ఆండీ ఫ్లవర్ 12 సెంచరీలతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. 1929 నుంచి 1939 వరకు ఇంగ్లాండ్ తరఫున ఆడిన లెస్ ఎమ్స్ 8 సెంచరీలు చేశాడు. దక్షిణాఫ్రికా స్టార్ ఏబీ డివిలియర్స్, ఇంగ్లాండ్ మాజీ కీపర్ మాట్ ప్రయర్, శ్రీలంక లెజెండ్ కుమార్ సంగక్కర, న్యూజిలాండ్ ఆటగాడు బీజే వాట్లింగ్ కూడా వికెట్ కీపర్లుగా పంత్‌తో సమానంగా 7 టెస్టు సెంచరీలు సాధించారు. పంత్ ప్రస్తుత ఫామ్ కొనసాగిస్తే మరిన్ని రికార్డులు బద్దలు కొట్టడం ఖాయమని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 7 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు.. రెండో రోజు తొలి సెషన్ ఇంగ్లాండ్‌దే





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాతో జరుగుతున్న లీడ్స్ టెస్టులో ఇంగ్లాండ్ తొలిసారి పుంజుకుంది. రెండో రోజు తొలి సెషన్ లో నాలుగు వికెట్లు తీసి భారత్ పై ఆధిపత్యం చూపించింది. పంత్ (134), గిల్ (147) తొలి రోజు జోరు కొనసాగించినా సెషన్ చివర్లో ఇంగ్లాండ్ వరుస పెట్టి వికెట్లను తీసింది. దీంతో 3 వికెట్ల నష్టానికి 430 పరుగులతో పటిష్టంగా కనిపించిన భారత్.. లంచ్ సమయానికి 7 వికెట్ల నష్టానికి 453 పరుగులు చేసింది. క్రీజ్ లో జడేజా (4), బుమ్రా (0) ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లలో కెప్టెన్ స్టోక్స్ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. కార్స్, బషీర్, టంగ్ తలో వికెట్ పడగొట్టారు. 3 వికెట్ల నష్టానికి 359 పరుగులతో బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియా రెండో రోజు కూడా అదే జోరు కొనసాగిస్తోంది. తొలి గంటలో గిల్, పంత్ జాగ్రత్తగా ఆడడంతో ఇంగ్లాండ్ కు వికెట్ ఏమీ రాలేదు. ఓ వైపు గిల్ డిఫెన్స్ కు పరిమితం కాగా.. మరో ఎండ్ లో పంత్ వేగంగా ఆడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పంత్ సిక్సర్ తో 146 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ దశలో ఒక్కసారిగా భారత్ కుప్పకూలింది. తొలి మ్యాచ్ సెంచరీ హీరో గిల్ (147) బషీర్ బౌలింగ్ లో మిడ్ వికెట్ మీదుగా క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 8 ఏళ్ళ తర్వాత టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చిన కరుణ్ నాయర్ డకౌటయ్యాడు. స్టంప్స్ కు దూరంగా వేసిన స్టోక్స్ బంతిని కరుణ్ షాట్ ఆడగా.. పోప్ డైవ్ చేసి స్టన్నింగ్ క్యాచ్ అందుకున్నాడు. సెంచరీ చేసి ఊపు మీద కనిపించిన పంత్ (134) టంగ్ వేసిన ఇన్ స్వింగ్ డెలివరీకి ఔటయ్యాడు. లంచ్ చివరి ఓవర్ ముందు శార్దూల్ (1) ను స్టోక్స్ ఔట్ చేయడంతో భారత్ ఏడో వికెట్ కోల్పోయింది.

# డుప్లెసిస్ మెరుపు సెంచరీ.. 40 ఏళ్ళ వయసులో ప్రపంచ రికార్డ్ సమం చేసిన మాజీ సఫారీ కెప్టెన్





**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ వయసుతో సంబంధం లేకుండా టీ20 ఫార్మాట్ లో తన తడాఖా చూపిస్తున్నాడు. మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీలో భాగంగా 40 ఏళ్ళ వయసులో ప్రపంచ రికార్డ్ ను సమం చేయడం విశేషం. టెక్సాస్ సూపర్ కింగ్స్ కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ డల్లాస్ వేదికగా శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 48 బంతుల్లోనే సెంచరీ బాదాడు. ఫాఫ్ ఇన్నింగ్స్ లో 6 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్ తో డుప్లెసిస్ కెప్టెన్ గా 7 సెంచరీలు పూర్తి చేసుకొని టీ20 క్రికెట్ లో ప్రపంచ రికార్డ్ సమం చేశాడు. టీ20 క్రికెట్ లో కెప్టెన్ గా అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల లిస్టులో బాబర్ అజామ్, క్లింగర్ తో సమంగా డుప్లెసిస్ నిలిచాడు. బాబర్ అజామ్ కెప్టెన్‌గా 144 మ్యాచ్‌ల్లో ఏడు టీ20 సెంచరీలు సాధించగా.. ఫాఫ్ 202 మ్యాచ్‌ల్లో ఈ ఘనతను అందుకున్నాడు. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ క్లింగర్ కెప్టెన్‌గా కేవలం 120 మ్యాచ్‌ల్లోనే ఏడు సెంచరీలు సాధించాడు. స్టార్ ఇండియన్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 193 మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా ఐదు సెంచరీలతో ఈ ముగ్గురి తర్వాత స్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన టెక్సాస్ సూపర్ కింగ్స్ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులు చేసింది. కెప్టెన్ డుప్లెసిస్ 51 బంతుల్లో 100 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. సాయితేజా ముక్కమల్ల 24 బంతుల్లో 38 పరుగులు చేసి సూపర్ కింగ్స్ కెప్టెన్ కు మంచి సహకారాన్ని అందించాడు. లక్ష్య ఛేదనలో శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్స్ కేవలం 16.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు మాథ్యూ షార్ట్ (29 బంతుల్లో 61), ఫిన్ అల్లెన్ (35 బంతుల్లో 78) విజృంభించడంతో 22 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరుకుంది.



**కంగనా శర్మ ఇన్‌స్టాగ్రామ్‌పై మండిపడ్డారు**

# ప్యారడైజ్ లో 40 కి చొక్కా కొన్నవాడిని నేను!



నేడు స్టార్ డైరెక్టర్లగా రాణిస్తున్న వారంతా ఇండస్ట్రీలో కష్టపడి ఎదిగిన వారే. అసిస్టెంటెడ్ డైరెక్లర్టగా, రైటర్లగా రకరకాల విభాగాల్లో పనిచేసి టాప్ డైరెక్టర్లగా రాణిస్తున్నవారెంతో మంది. అలాంటి వాళ్లలో బాబి అలియాస్ కె.ఎస్ రవీంద్ర ఒకరు. - పవర్- సినిమాతో దర్శకుడిగా పరిచయమైన బాబి ఎలాంటి హిట్లు ఇచ్చాడో చెప్పాల్సిన పనిలేదు. -జై లవకుశ-వెంకీ మామ-వాల్తేరు వీరయ్య-డాకు మహారాజ్- లాంటి విజయాలతో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్నాడు.

బాబి ప్రయాణం కూడా అసిస్టెంట్ గానే మొదలైంది. అయితే ఎదిగే క్రమంలో ఇండస్ట్రీలో చాలా ఇబ్బందులు ఎదుర్కున్న విషయం తెలిసిందే. బ్యాక్ గ్రౌండ్ లేని వాళ్లంతా ఈ రకమైన సమస్యలు ఎదుర్కోవాల్సిందే. కొంత మంది దర్శకులు తన తెలివి తేటలు వాడుకుని క్రెడిట కూడా ఇవ్వకుండా మోసం చేసిన వాళ్లు చాలా మంది ఉన్నారన్నారు. అయినా ఏ రోజు తాను ఎదురు ప్రశ్నించలేదని... తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోవడంత తప్ప వాళ్ల నుంచి ఏదీ ఆశించలేదన్నాడు. శాంతంగా పనిచేసుకుంటూ వెళ్లిపోవడమే అలవాటు చేసుకున్నట్లు తెలిపాడు. స్టార్ డైరెక్టర్ కొరటాల శివ ను కూడా ఇండస్ట్రీలో ఇలా దోచుకున్న వారే. ఏకంగా తాను రాసిన కథతోనే తనకు తెలియకుండానే సినిమా తీసేసారని ఓ సందర్భంలో కొరటాల అన్నారు. ఇండస్ట్రీలో ఇలాంటి తెలివి దోపిడీలు అన్నవి జరుగుతూనే ఉంటాయి. అవతలి వారి ట్యాలెంట్ తొక్కేయాలని ఎంత మంది ఎన్నాళ్లు ఎదురు చూసినా? దానికి ఏదో ఒక రోజు ఫుల్ స్టాప్ పడుతుంది. అగ్ని పర్వతం బద్దలైతే సక్సెస్ రూపంలోనే ఆ బ్లాస్టింగ్ ఉంటుందని బాబి, కొరటాల చూసారు. అలాగే బాబి అసిస్టెంట్ డైరెక్టర్ గా ఉన్న సమయంలో ఆకలి కష్టాలు ఎదుర్కున్నట్లు తెలిపారు. వాటిని కష్టాలు అనడం కంటే స్వీట్ మెమోరీస్ గానే వాటిని భావిస్తానన్నారు. తాను ఎక్కిన ఏ మెట్టు మర్చిపోలేదని ప్రతీ మెట్టు ఎలా ఎక్కానో తనకు ఇప్పటికీ గుర్తుందన్నారు. ఇప్పుడు కోట్ల రూపాయాలు పారితోషికం అందుకుంటున్నా ప్యారడైజ్ లో 40 రూపాయలకు చొక్కా కొన్న రోజుల్ని ఎప్పటికీ మర్చిపోనన్నారు.



**అనసూయ భరద్వాజ్ బ్లూ కలర్‌లో చాలా అందంగా ఉంది**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com